# మన తొలివెలుగు

తెలుగు దినపత్రిక

RNI: TGBIL/26/A2289

www.manatolivelugu.in

CEO & Chief Editor : Vanga Nagaraj Reddy (Raju)

హైదరాబాద్ | శుక్రవారం 17 జూలై 2026 | సంపుటి : 1 | సంచిక : 46 | పేజీలు : 8 | వెల : 2/-


## రూ.10 వేల కోట్ల కంపెనీకి బాస్.. హోమ్ లోన్ ఇవ్వని బ్యాంక్!

సొంతంగా ఒక కంపెనీని నిర్మించడం అనేది చాలా సాహసంతో కూడుకున్న పని, అది పెద్ద విజయం కూడా. అలాంటి వ్యక్తికి బ్యాంకు హోమ్ లోన్ ఇవ్వడం పెద్ద విషయం కాదని చాలామంది అనుకుంటారు. కానీ.. ఇక్కడ ఒక వ్యాపారవేత్తకు ఎదురైన సంఘటన మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఆ విషయాన్ని తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఫిన్‌టెక్ సంస్థ రైజ్ (ధన్ పేరెంట్ కంపెనీ) వ్యవస్థాపకుడు ప్రవీణ్ జాధవ్ ఇటీవల హోమ్ లోన్ కోసం ఓ బ్యాంకును ఆశ్రయించారు. అయితే ఆయన దరఖాస్తును బ్యాంకు తిరస్కరించింది. కారణం ఏమిటంటే.. ఆయనను 'హై రిస్క్ బారోవర్'గా పరిగణించడం. దాదాపు 1.2 బిలియన్ డాలర్ల (రూ.10 వేల కోట్ల కంటే ఎక్కువ) విలువైన కంపెనీని నడుపుతున్న వ్యక్తికి కూడా ఈ పరిస్థితి రావడం చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేసింది. తనకు ఎదురైనా అనుభవాన్ని ప్రవీణ్ జాధవ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన అతి తక్కువ సమయంలోనే తెగ వైరల్ అయింది.

### ఓట్లు వేయలేదనే కక్షతోనే

# సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు



- బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి
- సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు
- అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని ఆగ్రహం
- ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది
- "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం

హైదరాబాద్

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఈరోజు ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు - మిగతా3లో



# సముద్ర గర్భంలో 392 మీటర్ల లోతున రహదారి

- ప్రపంచంలోనే అతిపెద్ద సబ్‌సీ టన్నెల్..
- నార్వే ఇంజనీరింగ్ అద్భుతం!
- ప్రపంచంలోనే అత్యంత పొడవైన, లోతైన సముద్రగర్భ రహదారి టన్నెల్‌ను నిర్మిస్తోన్న నార్వే
- 27 కిలోమీటర్ల పొడవు.. సముద్ర మట్టానికి 392 మీటర్ల లోతులో ఈ టన్నెల్ నిర్మాణం
- నిర్మాణంలో ఎదురవుతున్న బలహీనమైన రాతి పొరలు, నీటి లీకులు వంటి భౌగోళిక సవాళ్లు
- పశ్చిమ తీరంలో ప్రయాణ సమయాన్ని 40 నిమిషాల వరకు తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం

### సింగరేణి విశ్రాంత ఉద్యోగలపై

# సర్ ప్రక్రియ

- సర్ ప్రక్రియలో వేధిస్తున్న మారు పేరు ముప్పు
- ఓటు హక్కు కోల్పోయే ప్రమాదంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు
- గతంలో సింగరేణిలో మారుపేరుతో ఉద్యోగంలో చేరిన వారికి సర్ తలనొప్పి
- 10 వేల మంది విశ్రాంత ఉద్యోగులు ఓటు కోల్పోయే అవకాశం
- కుటుంబ సభ్యులతో కలిపి 25 వేలమంది ఓటర్లకు చేరిక



హైదరాబాద్

ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న సర్ ప్రక్రియ పలువురు ఓటర్లకు తలనొప్పి తెచ్చిపెడుతోంది. ప్రధానంగా సింగరేణిలో దశాబ్దాల కింద మారు పేరుతో ఉద్యోగంలో చేరి, ప్రస్తుతం జీవించి ఉన్న వారిలో చాలా మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం నెలకొంది. ఇలా పేరు మార్చుకొని కొలువు చేసి, పదవీ విరమణ పొంది తమ స్వగ్రామాల్లో ఉంటూ సొంత పేరుతో చెలామణి అవుతున్న వారితో పాటు వారి కుటుంబ సభ్యుల ఓటు హక్కు గల్లంతయ్యే ప్రమాదం ఏర్పడింది. 1970 నుంచి 1990 మధ్య కాలంలో టెక్నాలజీ అంతలా అభివృద్ధి చెందలేదు. ఈ సమయంలో సింగరేణిలో జనరల్ మేనేజర్ (జీఎం) స్థాయిలోనే ఉద్యోగాలు కల్పించే వెసలుబాటు ఉండేది. దీంతో అక్కడ - మిగతా3లో



### డీలిమిటేషన్ బిల్లును

# వ్యతిరేకిస్తాం

- పార్లమెంట్ సమావేశాల్లో అయోధ్య విరాళాల చోరీని ఎండగడతాం
- జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- దిల్లీలోని సోనియా నివాసంలో సమావేశమైన కాంగ్రెస్ అగ్రనేతలు
- పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తామని వెల్లడి



## 9వ తరగతిలో మూడో భాష ఎందుకు?

- సీబీఎస్ఈని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- 9వ తరగతిలో మూడో భాష ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం
- 9వ తరగతిలో మూడో భాషను ప్రారంభించడం కాదు, ఆపేయాలన్న కోర్టు
- ఇది విద్యార్థులపై అనవసర ఒత్తిడి పెంచుతుందని వ్యాఖ్య
- కొత్త భాషను 6వ తరగతిలోనే ప్రవేశపెట్టాలని కేంద్రానికి సూచన

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
- సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
- ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు
- పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం



కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి



## హర్మూజ్ గుండా వెళ్లే నౌకల్లో భారతీయ నావికులను నియమించకూడదు

- భారత్ కీలక ఆదేశాలు
- తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు ఈ ఆదేశాలను అమలు చేయాలని నిర్దేశం
- భారతీయ నావికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీఎంఏ వివరణ

### 'బుల్లెట్'

# గుబులు!

- నగర శివార్లలో నుంచే బుల్లెట్ ట్రైన్
- పంట పొలాల మధ్య నుంచి ముంబయికి
- 15 రోజులుగా బుల్లెట్ రైలు మార్గానికి మార్కింగ్
- పంట పొలాల మధ్య నుంచే ముంబయికి
- హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ మార్గమంతా వ్యవసాయ పొలాల మధ్యలో నుంచే



హైదరాబాద్

హైదరాబాద్ నగర శివారుల్లోని శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయికి హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ మార్గానికి అడుగులు వేగంగా ముందుకు పడుతున్నాయి. ఇప్పటికే సంబంధిత అధికార యంత్రాంగం దీనికి సంబంధించి మార్కింగ్ పనులను చేస్తున్నారు. ప్రస్తుతం హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ మార్గమంతా వ్యవసాయ పొలాల మధ్యలో నుంచే వెళ్తుండటంతో అన్నదాతలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న ఏడు బుల్లెట్ రైళ్లలో మూడు మార్గాలు తెలంగాణలోనే ఏర్పాటవుతున్నాయి. ఇదే విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడంతో నగర - మిగతా3లో



### కనుల పండువగా మొదలైన

# గోల్కొండ బోనాలు

- తొలి బోనం సమర్పించిన కుమ్మర్లు
- గోల్కొండలో ఆషాఢమాస బోనాలు
- రాష్ట్ర ప్రభుత్వం తరపున లంగర్‌హౌస్ నుంచి బంగారు బోనం
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ

హైదరాబాద్

తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మకమైన శ్రీ జగదాంబికా మహంకాళి అమ్మవారికి 11 బోనాలతో కుమ్మరులు తొలి బోనం సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ లంగర్‌హౌస్ నుంచి ప్రభుత్వం తరపున బంగారు బోనం, పట్టు వస్త్రాలను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ సమర్పించారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ. 15.05 కోట్లను ఈ ఉత్సవాల కోసం - మిగతా3లో

# సముద్ర గర్భంలో 392 మీటర్ల లోతున రహదారి

ఇంజనీరింగ్ రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ నార్వే ప్రభుత్వం ఒక భారీ ప్రాజెక్టును నిర్మిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత పొడవైన, అత్యంత లోతైన సముద్రగర్భ రహదారి టన్నెల్ నిర్మాణంతో చరిత్ర సృష్టించబోతోంది. 'రోగ్‌ఫాస్ట్' పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, 27 కిలోమీటర్ల పొడవుతో సముద్ర మట్టానికి సుమారు 392 మీటర్ల (దాదాపు 1286 అడుగులు) లోతున ప్రయాణించే అద్భుతమైన రహదారి అందుబాటులోకి వస్తుంది. నార్వే పశ్చిమ తీరంలోని బోక్నాఫ్జోర్డ్ సముద్ర జలాల కింద ఈ రెండు వరుసల సొరంగాన్ని నిర్మిస్తున్నారు.



### ప్రయాణ కష్టాలకు చెక్

నార్వే పశ్చిమ తీర ప్రాంతం మత్స్య, చమురు, గ్యాస్, వాణిజ్య కార్యకలాపాలకు ఎంతో కీలకం. అయితే, ఈ ప్రాంతంలోని ప్రధాన నగరాలైన స్టావాంగర్, బెర్గెన్ మధ్య ప్రయాణం ప్రస్తుతం ఫెర్రీలు, చిన్నచిన్న టన్నెళ్లపై ఆధారపడి సాగుతోంది. దీనివల్ల ప్రయాణ సమయం దాదాపు ఐదు గంటల వరకు పడుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం 'ఈ39 కోస్టల్ హైవే' ప్రాజెక్టులో భాగంగా ఫెర్రీ రహిత మార్గాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా చేపట్టిన రోగ్‌ఫాస్ట్ టన్నెల్ పూర్తయితే, కీలక మార్గాల్లో ప్రయాణ సమయం సుమారు 40 నిమిషాల వరకు తగ్గనుంది. అన్ని కాలాల్లోనూ రవాణాకు ఎలాంటి అంతరాయం ఉండదు.

### నిర్మాణంలో ఎదురవుతున్న తీవ్ర సవాళ్లు

ఈ టన్నెల్ నిర్మాణం అత్యంత క్లిష్టమైన సవాళ్లతో కూడుకున్నది. కొన్ని దేశాల్లో మాదిరిగా ముందుగా తయారుచేసిన కాంక్రీట్ భాగాలను అమర్చకుండా, నేరుగా సముద్ర గర్భంలోని దృఢమైన రాతి పొరలను తొలిచి ఈ మార్గాన్ని నిర్మిస్తున్నారు. పనులను వేగవంతం చేసేందుకు ఉత్తరం, దక్షిణం, మధ్య భాగాల నుంచి ఏకకాలంలో నిర్మాణం సాగిస్తున్నారు. అయితే, సముద్ర మట్టానికి దాదాపు 300 మీటర్ల లోతులో పనులు సాగుతున్నప్పుడు, బలహీనమైన, పగుళ్లు ఉన్న రాతి పొరల నుంచి పెద్ద ఎత్తున సముద్రపు నీరు లీక్ అవుతోంది. లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ భౌగోళిక నిర్మాణాల వల్ల పనులు నెమ్మదిస్తున్నాయి. ఇంజనీర్లు ప్రత్యేకమైన గ్రౌటింగ్, సీలింగ్ టెక్నాలజీలను ఉపయోగించి నీటి లీకులను అరికట్టి, చుట్టుపక్కల రాతి పొరలను స్థిరీకరిస్తున్నారు. నార్వేజియన్ పబ్లిక్ రోడ్స్ అడ్మినిస్ట్రేషన్ ప్రాజెక్ట్ మేనేజర్లు ఈ సమస్యలను ధృవీకరించారు. భద్రతా ప్రమాణాల ప్రకారం, టన్నెల్ పైభాగంలో కనీసం 50 మీటర్ల మందంతో దృఢమైన రాతి పొర ఉండాలి.

### భవిష్యత్ ప్రయోగాలకు మార్గదర్శి

ఈ ప్రాజెక్టులో మరో ప్రత్యేకత ఉంది. సముద్ర మట్టానికి 260 మీటర్ల లోతులో ఒక భూగర్భ జంక్షన్, రౌండ్‌అబౌట్‌లను నిర్మిస్తున్నారు. ఇది సమీపంలోని క్విట్సోయ్ ద్వీపానికి కనెక్టివిటీని అందిస్తుంది. ఖర్చుల పెరుగుదల కారణంగా 2019లో తాత్కాలికంగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్ట్, 2021లో పునఃప్రారంభమైంది. దీని అంచనా వ్యయం దాదాపు 2.3 బిలియన్ యూరోలు. ప్రభుత్వ నిధులు, టోల్ రుసుములతో ఈ ప్రాజెక్టును పూర్తిచేయనున్నారు. 2033 నాటికి ఈ టన్నెల్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు విజయం, భవిష్యత్తులో నార్వే చేపట్టబోయే తేలియాడే టన్నెల్స్ వంటి మరిన్ని క్లిష్టమైన ప్రాజెక్టులకు మార్గదర్శకంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తాం

త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం, విద్యా వ్యవస్థలో నెలకొన్న వ్యవస్థాగత క్షీణత వంటి కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ పేర్కొంది. డీలిమిటేషన్, తీవ్రమైన నేరాల్లో అరెస్టై 30 రోజులకు మించి జైల్లో ఉన్న ప్రధానులు, సీఎంలు, మంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా గట్టిగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. ఢిల్లీలో ఉన్న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) అధ్యక్షురాలు సోనియా గాంధీ నివాసంలో హస్తం పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, చిదంబరం, నసీర్ హుస్సేన్, మాణికం ఠాగూర్, తారిఖ్ అన్వర్, శశి థరూర్, మనీశ్ తివారీ తదితరులు సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌లో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.



### ఆ అంశాలపై మోదీ సర్కార్‌ను నిలదీస్తాం : ఖర్గే

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో దేశంలో పేపర్ లీక్‌లు, ధరల పెరుగుదల, విదేశాంగ విధానం, అవినీతి ఆరోపణలు, అట్టడుగు వర్గాల హక్కులతో సహా పలు అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తెలిపారు. పౌరుల జీవితాలు, ఆశయాలపై ప్రభావం చూపే అత్యవసర అంశాలపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. సీపీపీ సమావేశం అనంతరం ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

"అయోధ్య విరాళాల చోరీ, పేపర్ లీక్‌లు, విద్యా వ్యవస్థ క్షీణత, వ్యవస్థలను తమ గుప్పిట్లోకి తీసుకోవడం, రాజకీయ పార్టీలను చీల్చడం, కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు, ప్రజల నడ్డి విరిచే ధరల పెరుగుదల, విదేశాంగ విధాన వైఫల్యాలు, మోదీ ప్రభుత్వ వ్యూహాత్మక తప్పిదాలు, 3.5 కోట్ల వాహన యజమానులపై ఇథనాల్ మిశ్రమ విధానాన్ని రుద్దడం, అదుపులేని అటవీ నిర్మూలన, అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనారిటీల హక్కులపై నిరంతర దాడులు వంటి కీలక అంశాలపై రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తుంది. " అని ఖర్గే పేర్కొన్నారు.

### అఖిలపక్షం ఏర్పాటు చేయాలని మోదీకి ఖర్గే లెటర్

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తిరిగి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని యోచిస్తోందన్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు దాని నిశిత పరిశీలనకు తమకు తగిన సమయం ఇవ్వాలని లేఖలో కోరారు. డీలిమిటేషన్ బిల్లు సవరించిన ప్రతిపాదనలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయంలో ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుకు తాను లేఖలు రాశానని ఖర్గే పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు ఆ అభ్యర్థనలను ఆయన పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ ప్రభుత్వానికి లోక్‌సభలో లభించలేదని పేర్కొన్నారు.

### కేంద్ర సర్కార్ ప్రవేశపెట్టబోయే బిల్లులపై సవిరంగా చర్చించాం : జైరాం రమేశ్

రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లును తిరిగి ప్రవేశపెడితే తమ పార్టీ దానిని గట్టిగా వ్యతిరేకిస్తుందని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర సర్కార్ ప్రవేశపెట్టే అవకాశం ఉన్న బిల్లులు,'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదిక వంటి అంశాలపై సీపీసీ సమావేశంలో సవివరంగా చర్చలు జరిపిందని తెలిపారు. ప్రభుత్వ అధికారిక శాసనపరమైన అజెండా తమ పార్టీకి ఇంకా అందలేదని, జులై 19న జరగనున్న అఖిలపక్ష సమావేశంలో వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ మీటింగ్ అనంతరం జైరాం రమేశ్ ఈ మేరకు విలేకరులతో వ్యాఖ్యానించారు. "ఏప్రిల్ 17న మోదీ ప్రభుత్వానికి మూడింట రెండొంతుల మెజారిటీ లేక పార్లమెంట్‌లో వీగిపోయిన డీలిమిటేషన్ బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా మళ్లీ తిరిగి సభలో తిరిగి ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మేము విన్నాము. డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరి ఎల్లప్పుడూ స్పష్టంగా, స్థిరంగా ఉంది. మేము డీలిమిటేషన్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తాం. వ్యతిరేకిస్తూనే ఉంటాం. ప్రతిపక్ష పార్టీలన్నింటిలో ఐక్యత కోసం అన్ని విధాలా ప్రయత్నిస్తాం. ప్రతిపక్ష పార్టీలను చీల్చడం ద్వారా ఈ బిల్లును ఆమోదించడానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సంపాదించడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఏప్రిల్ 16, 17 తేదీలలో డీలిమిటేషన్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిన అన్ని పార్టీలతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, విపక్ష నేత రాహుల్ గాంధీ సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్న తీవ్రమైన నేరాల్లో అరెస్టై 30 రోజులకు మించి జైల్లో ఉన్న ప్రధానులు, సీఎంలు, మంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు-2025, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రతా చట్టం -2013 సవరణ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుంది."

### అమిత్ షా పార్టీలను చీల్చారు : జైరాం రమేశ్

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, అయితే దానిని ప్రతిపాదిత డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని వ్యతిరేకిస్తుందని జైరాం రమేశ్ అన్నారు. లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్య ఆధారంగానే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని తాము అనేక సార్లు డిమాండ్ చేశామని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అలా చేయడానికి సిద్ధంగా ఉంటే తాము ఆ బిల్లుకు మద్దతు ఇస్తామని ప్రకటించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పలు పార్టీలను చీల్చారని ఆరోపించారు. కుతంత్రాల ద్వారా లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీని సాధించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇది రాజ్యాంగాన్ని అవమానించడమేనని విమర్శించారు. ఒకవేళ అలా మెజారిటీ సాధించినా అది ప్రజాస్వామ్యానికే మచ్చగా మిగిలిపోతుందని అన్నారు. అయితే లోక్‌సభలో బీజేపీకి మూడింట రెండొంతుల మెజారిటీ లభించే అవకాశం లేదని స్పష్టం చేశారు.

## 'ప్రతి పౌరుడి ప్రాణం అమూల్యమైనది'

### వాంగ్‌చుక్ ఆరోగ్యంపై రోజువారీ పర్యవేక్షణకు హైకోర్టు ఆదేశం

గత కొన్ని రోజులుగా జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ఆరోగ్యం, భద్రతను ప్రభుత్వమే చూసుకోవాలని ఢిల్లీ హైకోర్టు సూచించింది. ఈ మేరకు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. అవసరమైతే వెంటనే వైద్య చికిత్స అందించాలని స్పష్టం చేసింది. సోనమ్ నిరాహార దీక్షను విరమించకపోతే, 48 గంటల్లో ఆయన బతకకపోవచ్చని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా ప్రతి పౌరుడి ప్రాణం ఎంతో విలువైనదని, వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియా ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం తరఫున వర్చువల్‌గా హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని ఇప్పటికే రోజూ పరీక్షిస్తున్నామని కోర్టుకు తెలిపారు. ప్రభుత్వ వైద్యులు, వైద్య నిపుణులు ఆయన ఆరోగ్య సూచికలను నిరంతరం పరిశీలిస్తున్నారని వివరించారు. దీనిపై ధర్మాసనం, ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థ ఉందా అని ప్రశ్నించగా, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మెహతా స్పష్టం చేశారు. అవసరమైతే మరో వైద్య బృందాన్ని కూడా పంపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నమోదు చేసిన హైకోర్టు, ప్రభుత్వ వైద్యులు, నిపుణులు రోజూ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని పరీక్షించాలని ఆదేశించింది. వారి సూచనల మేరకు అవసరమయ్యే వైద్య చికిత్సను వెంటనే అందించాలని స్పష్టం చేసింది. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ రాకేశ్ కుమార్ సాహ్నీ పిల్‌ను దాఖలు చేశారు. ఆయన మరో 48 గంటలు నిరాహారదీక్ష ఇలాగే కొనసాగితే చనిపోయే ప్రమాదం ఉందని పిటిషన్?లో పేర్కొన్నారు. వెంటనే వైద్య సహాయం అందేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై గురువారం విచారణ చేపట్టిన హైకోర్టు కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం తరఫున స్పష్టమైన హామీ రావడంతో ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని ముగించింది. ఇదిలా ఉండగా, సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు తాజా హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. గత 19 రోజులుగా ఉపవాసం కొనసాగిస్తున్న ఆయన బరువు 9 కిలోలకు పైగా తగ్గినట్లు సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సతీశ్ లాంబా వెల్లడించారు. ఆయన రక్తంలో చక్కెర స్థాయి డెసీలీటర్‌కు 80 మిల్లీగ్రాములుగా నమోదైందని చెప్పారు.

## 9వ తరగతిలో మూడో భాష ఎందుకు?

9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టాలన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పదో తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులపై ఇది అదనపు భారాన్ని మోపుతుందని, వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం విచారణ సందర్భంగా కోర్టు కీలకమైన మౌఖిక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "9వ తరగతిలో మూడో భాషను ప్రవేశపెట్టడం సరికాదు. ఆ వయసులో విద్యార్థులు ఇప్పటికే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటుంటారు. అటువంటి సమయంలో కొత్త భాషను ఎందుకు పరిచయం చేస్తారు? అవసరమైతే ఆరో తరగతి నుంచే దీని అమలు చేయండి" అని జస్టిస్ నాగరత్న కేంద్రానికి సూచించారు. పదో తరగతి బోర్డు పరీక్షల తాలూకు ఒత్తిడి ఎనిమిదో తరగతి నుంచే మొదలవుతుందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న సీబీఎస్ఈ నూతన నిబంధనల ప్రకారం, 9వ తరగతి విద్యార్థులు మూడు భాషలను అభ్యసించాల్సి ఉంటుంది. అందులో కనీసం రెండు భారతీయ భాషలు ఉండటం తప్పనిసరి. ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై గతంలోనే నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు, దీని అమలుపై స్టే ఇచ్చేందుకు మాత్రం అప్పట్లో నిరాకరించింది. తమిళనాడులో ద్విభాషా విధానం అమల్లో ఉన్న నేపథ్యంలో, నవోదయ పాఠశాలల ఏర్పాటుపై కోర్టు ప్రత్యేకంగా ప్రస్తావించింది. త్రిభాషా సూత్రంలో హిందీ తప్పనిసరి కాదని, సంస్కృతం లేదా ఇతర ప్రాంతీయ భాషలను ప్రత్యామ్నాయాలుగా పరిశీలించవచ్చని పేర్కొంది. నవోదయ విద్యాలయాలకు భూ కేటాయింపులపై తగిన నిర్ణయం తీసుకునేందుకు తమిళనాడు ప్రభుత్వానికి ఆగస్టు 11 వరకు సమయం ఇచ్చింది. ప్రస్తుత విచారణలో కోర్టు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, ధర్మాసనం చేసిన మౌఖిక వ్యాఖ్యలు విద్యా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

## 'హర్మూజ్ గుండా వెళ్లే నౌకల్లో భారతీయ నావికులను నియమించకూడదు'

అమెరికా- ఇరాన్ యుద్ధం తీవ్రమైన వేళ హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల విషయంలో భారత ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీచేసింది. హర్మూజ్ గుండా రాకపోకలు సాగించే నౌకల్లో భారతీయ నావికులను నియమించకూడదని సముద్రయాన నియంత్రణ సంస్థ(డీజీఎంఏ) స్పష్టంచేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు ఈ ఆదేశాలను అమలు చేయాలని నౌకల యజమానులు, నిర్వాహకులు, రిక్రూట్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్స్ సంస్థలకు నిర్దేశించింది. గల్ఫ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులు దిగజారుతున్న వేళ భారతీయ నావికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీఎంఏ వివరించింది. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధితో పాటు పరిసర ప్రాంత జలాల్లో నిఘాను పెంచాలనీ నావిగేషనల్ హెచ్చరికలు, భద్రతాసలహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఐఎస్?పీఎస్? కోడ్‌ను కఠినంగా అమలు చేయాలని సూచించింది. నౌకాయానానికి సంబంధించిన అంతర్జాతీయ నియామవళిని కచ్చితంగా పాటించాలని పేర్కొంది. అలాగే, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన వివరాలను షేర్? చేసింది. గల్ఫ్? ప్రాంతంలో మారుతున్న పరిస్థితులను తాము ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, భారత నావికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని తెలిపింది.



### ఆ నౌకలు నేవిగేషన్ హెచ్చరికలను పట్టించుకోలేదా?

కాగా అమెరికా- ఇరాన్ యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో ఘర్షణలతో కూడిన హర్మూజ్ జలసంధిలో అనేక వాణిజ్య నౌకలు దాడులకు గురవుతున్నాయి. తాజాగా యూఏఈ నౌకలపై ఇరాన్ చేసిన దాడుల్లో ఇద్దరు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఆ రెండు నౌకలు నేవిగేషన్? హెచ్చరికలను విస్మరించినట్లు సమాచారం. అలాగే, ఇటీవల ఒమన్? తీరంలో జీఎఫ్?ఎస్? గెలాక్సీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్? దాడి చేసింది. ఆ దాడిలో ఒక భారతీయుడు గల్లంతయ్యాడు. తాజాగా అతడు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. గల్లంతైన అనంతరం అతడిని కాపాడేందుకు చర్యలు చేపట్టినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. మరోవైపు, భారతీయులు మృతి చెందడం పట్ల భారత్? తీవ్రంగా స్పందించింది. దాడులను ఖండిస్తూ, ఇరాన్? ఉప దౌత్యవేత్తకు సమన్లు జారీచేసింది. అలాగే, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా హర్మూజ్?లో స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని పేర్కొంది.

### వైద్య సహాయం అందక భారత నావికుడు మృతి

కొద్దిరోజుల క్రితం కూడా ఒమన్ తీరంలో వైద్యం అందక భారత నావికుడు మృతి చెందాడు. ఒమన్ తీరంలోని 'ఎంటీ సెలెస్టియల్' నౌకలో సెకండ్ ఆఫీసర్ నిశాంత్ అనారోగ్యానికి గురయ్యాడు. అయితే, ఇరాన్ దాడులు చేస్తుండటంతో సకాలంలో అతడికి వైద్య సాయం అందలేదు. ఈ నేపథ్యంలో నిశాంత్ మరణించినట్లు ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా పేర్కొంది. మృతదేహానికి సరైన సంరక్షణ లేకుండా నౌకలోనే ఉన్నట్లు తెలిపింది. కాగా, మృతుడు తమిళనాడుకు చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు. ఇక, పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్ నౌకాశ్రయాలపై మళ్లీ దిగ్బంధనం విధించింది అమెరికా. అలాగే, అమెరికా దాడుల్లో ఏడుగురు సైనికులు మృతిచెందారని, 260 మందికిపైగా గాయపడ్డారని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్? తీవ్రంగా స్పందించింది. ఇటీవల అమెరికా, ఇరాన్? మధ్య కుదిరిన శాంతి ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు ఇరాన్? ఇప్పటికే ప్రకటించింది. నౌకాదళ దిగ్బంధనం విధించి అమెరికా ఒప్పందాన్ని పూర్తిగా ముక్కలు చేసిందని ఇరాన్ ఆరోపించింది. అలాగే, ఇకపై ఆ దేశంతో చర్చలు జరిపే అవకాశమే లేదని తేల్చి చెప్పింది. మరోవైపు, టెహ్రాన్?? చర్చలకు ముందుకు రాకుండే ఆ దేశంపై దాడులను తీవ్ర తరం చేస్తామని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్? ట్రంప్? హెచ్చరించారు. వచ్చే వారం నుంచి పరిస్థితి మరింత అధ్వానంగా మారుతుందని పేర్కొన్నారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగలపై సర్ ప్రక్రియ

-మొదటిపేజీ తరువాయి

చాలా మంది ఇతరుల పేర్ల మీద కొలువుల్లో చేరారు. సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య 2001 నాటికి లక్ష మందికి పైనే. ప్రస్తుతం ఇది 40 వేలకు తగ్గిపోయింది. పదవీ విరమణ పొందిన వారిలో ప్రస్తుతం 10 వేల మంది జీవించి ఉండగా, వారి కుటుంబ సభ్యులతో కలిపి 25 వేలకు చేరుతోంది.

**పేర్లు ఎందుకు మార్చుకున్నారంటే**

అప్పట్లో బొగ్గు టబ్బుల చక్రాలు, ఇసుక బస్తాలు ఎత్తడం, పరగు పందెం వంటి పద్ధతుల ద్వారా వేల సంఖ్యలో సింగరేణి కొలువుల్లో చేరారు. ఆ కాలంలో గని ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. దీంతో చాలా మంది పని చేసేందుకు మొగ్గు చూపేవారు కాదు. అయితే, ఎంప్లాయ్?మెంట్ కార్డు ఉన్నవారికి డబ్బు చెల్లించి ఇతరులు దాన్ని వినియోగించుకున్నారు. ఈ క్రమంలో ఆ కార్డులోని పేరు మీదనే చాలా మంది గనిలో ఉద్యోగాల్లోకెక్కారు. దీనికి తోడు అప్పుడు జీఎంల స్థాయిలో ఉద్యోగ నియామకం ఉండటం వల్ల డబ్బులు తీసుకొని వారికి తెలిసిన వారిని, బంధువులను నియమించారు. ఈ విధంగా కార్డులోని మారు పేర్లతో చేరినవారు ఉద్యోగంలో కొనసాగినంత వరకూ అదే పేరుతోనే పని చేశారు.

**2002 నాటి ఓటరు జాబితా కోసం**

సాధారణంగా కోల్‌బెల్ట్‌లో ఒక చోటు నుంచి మరో ప్రాంతానికి బదిలీలు జరుగుతుంటాయి. ఇలా చాలా మంది అధికారులు, శ్రామికులు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇప్పుడు వారు 2002 నాటి ఓటరు జాబితా ఎక్కడ దొరుకుతుందో తెలియక ఎంతో అవస్థ పడుతున్నారు. చదువుకున్నవారితో పాటు విద్యావంతులైన పిల్లల సహాయం ద్వారా పలువురు 2002 నాటి జాబితాను ఆన్‌లైన్‌లో పొందగలిగారు. అయినా చాలా మందికి సర్ సమాచారం అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరునామా మారిన వారి వివరాలు బీఎల్‌ఓలకు తెలియక ఆచూకీ కోసం వారు ఇబ్బంది పడుతున్నారు.

**'అసలు పేరు రాసే అవకాశం లేదు'**



కరోనా సమయంలో రమణయ్య (పేరు మార్చాం) అనే ఓ విశ్రాంత ఉద్యోగి చనిపోయారు. ఈయన గతంలో మారు పేరుతో గనిలో ఉద్యోగం చేశారు. ఈయనకు ముగ్గురు కుమారుల్లో మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా ఒకరికి కొలువు ఇప్పించారు. తండ్రి మారు పేరుతో ఉన్న ఇంటిపేరుతోనే కుమారుడు కూడా తన పేరును కొనసాగించి ఉద్యోగంలో చేరాడు. తమ తండ్రి అసలు పేరుతో చెలామణి అవుతున్న మిగితా ఇద్దరు కుమారులకు ఇప్పుడు సమస్యగా ఎదురైంది. 2002 తమ తండ్రి పేరు ప్రకారం ఇప్పుడు సర్? జాబితాలో నింపడానికి అవకాశం లేకుండా పోయిందని వారిద్దరు వాపోతున్నారు.

**సొంత పేరుతో ఓటు కోల్పోయే ప్రమాదం**

రామయ్య (అసలు పేరు కాదు) అనే ఓ రిటైర్డ్ ఉద్యోగి రాజి రెడ్డి అనే పేరుతో గతం ఉద్యోగంలో చేరారు. పదవీ విరమణ పొందిన తర్వాత సొంతూరుకు వెళ్లి వ్యవసాయ భూములను చూసుకుంటూ సొంత పేరుతో చెలామణి అవుతున్నారు. క్రమంగా అన్ని రికార్డుల్లోనూ ఇదే పేరును వినియోగించారు. అయితే, పాత మారు పేరు లేకపోవడంతో అతని భార్యాపిల్లల ఓట్లు కూడా కోల్పోయే ప్రమాదం నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అత్యధికంగా అలియాస్ పేర్లే**


సింగరేణిలో 2002 నాటికి 1.05 లక్షల మంది ఉద్యోగులు ఉండేవారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా సుమారు 65 వేల మంది వరకు ఉద్యోగ విరమణ చేసి ఉండొచ్చు. వీరిలో 80 శాతం మంది నిరక్షరాస్యులే ఉన్నారు. దీంతో చాలా మంది అలియాస్ పేర్లతో ఉన్నవారి సంఖ్యే అధికం. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇలా అలియాస్ పేర్లను క్రమబద్ధీకరణ చేయాలని కసరత్తు చేసింది. కానీ, పలు కారణాలతో అది కార్యరూపం దాల్చకపోవడంతో ఈ సమస్య అలాగే ఉండిపోయింది.

# గ్రీన్?వ్యాలీగా మారనున్న ఓయూ
# వెయ్యి కోట్లతో సిద్ధమవుతున్న డీపీఆర్

ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్? చరిత్రలో అంతర్భాగం. ఎన్నో లక్షల మంది విద్యార్థులకు చదువు చెప్పడంతో పాటు సమాజ నిర్మాణంలో వారిని భాగస్వామ్యులను చేసింది. నీళ్లు, నిధులు, నియమకాలే లక్ష్యంగా ఉవ్వెత్తిన ఎగసిన తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లోనూ ఓయూ ముఖ్యపాత్ర పోషించింది. రాష్ట్ర ఆవిర్భానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం కొత్త రూపును సంతరించుకోనుంది. వర్సిటీలో త్వరలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. ఓయూ అభివృద్ధికి బాటలు : 108 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆనవాళ్లు భవిష్యత్? తరాలకు తెలిపేలా అత్యాధునిక సాంకేతిక భవన నిర్మాణాలుండేలా సరికొత్తగా తీర్చిదిద్దనున్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో అంతర్భాగమైన ఓయూ భవిష్యత్? తరాల వారికి ఉపయోగపడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో పాటు రూ.1,000 కోట్ల నిధులను కేటాయించారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక) తయారీని కన్సల్టెంట్లకు అప్పగించారు. దీంతో వర్సిటీ అభివృద్ధికి బాటలు పడనున్నాయి.

**పర్యావరణానికి హాని కలగకుండా**

విశ్వవిద్యాలయంలో చెట్లు, పచ్చిక బయళ్లతో ప్రాంగణమంతా చల్లగా ఉంటుంది. కొత్తగా నిర్మించనున్న ఆధునిక భవనాల ద్వారా పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా కొత్తగా బయో డైవర్సిటీ పార్కును అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రాంగణంలోని చెరువులను సహజ సిద్ధంగా నీళుండే విధంగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు వీలుగా సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నారు. అధికారులు, సందర్శకులు విద్యుత్తు వాహనాల్లో(ఈవీలు) రావాలంటూ సూచిస్తున్నారు. ఇక ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రవేశ(ఎంట్రీ), నిష్క్రమణ మార్గాల(ఎగ్జిట్?) వద్ద డిజిటల్ గేట్లను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు ప్రయోజనం కలిగేవిధంగా ఇంటిగ్రేటెడ్ డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయనున్నారు.



అత్యాధునిక ప్రయోగశాలల కాంప్లెక్స్?లు : పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఓయూలో ప్రత్యేకంగా ప్రయోగశాలల కాంప్లెక్స్‌లను నిర్మించనున్నారు. ప్రస్తుతమున్న బయోటెక్నాలజీ, ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, సీపీఎంబీ ప్రయోగశాలల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయ ఆధారిత పరిశోధనలు కొనసాగుతున్నాయి.

"విశ్వవిద్యాలయం అభివృద్ధిలో భాగంగా పర్యావరణహిత భవనాలను నిర్మించనున్నాం. నూతన అకడమిక్ బ్లాక్, విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణాల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగించనున్నాం. దేశవ్యాప్తంగా ఐఐటీల తరహాలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురానున్నాం. టెండర్లు ఖరారయ్యాక రెండు సంవత్సరాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ఆవిష్కరించనున్నాం"

**నాణ్యమైన పరిశోధనలు**

నాణ్యమైన పరిశోధనల కోసం స్పెషల్ క్లాస్‌లు ప్రారంభించి పరిశోధన నాణ్యత పెంపుపై వర్సిటీ దృష్టి సారించారు. మధ్యలో పరిశోధన నిలిపివేసిన విద్యార్థులతో వ్యక్తిగతంగా సమావేశమై రీసెర్చ్ పూర్తి చేయాలని ప్రోత్సహిస్తున్నారు. సైన్స్ విద్యార్థుల కోసం ఆధునిక ప్రయోగశాలలతో పాటు హిస్టరీ, లింగ్విస్టిక్స్, ఆంగ్లం, సోషియాలజీ తదితర విభాగాల అధ్యాపకులు దేశ, విదేశాల్లో జరిగే జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పించేలా పోత్సాహాన్ని అందిస్తున్నారు. దీంతో కళాశాలలోని వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు గడువులోగా పరిశోధనలు పూర్తి చేస్తున్నారు.

**తరగతి గదులకే పరిమితం చేయకుండా**

విద్యార్థులను తరగతి గదులకు మాత్రమే పరిమితం చేయకుండా వారిలోని నిగూఢమైన ప్రతిభను వెలికితీసేందుకు కల్చరల్, డిబేట్ మీడియా, స్పోర్ట్స్ క్లబ్‌లను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి నెల ఈ క్లబ్‌ల ఆధ్వర్యంలో సమావేశాలు, పోటీలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న స్కిల్స్‌ను ప్రోత్సహిస్తున్నారు.

# దశాబ్దాలుగా నెరవేరని ఆర్మూర్ లెదర్‌పార్క్ కల

చర్మకారుల కుటుంబాలు అధికంగా ఉండే జిల్లా ఉమ్మడి నిజామాబాద్. వీరికి ఉపాధి కల్పించేందుకు జిల్లాలో రెండు దశాబ్దాల క్రితం లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాలమైతే గడిచిపోయింది కానీ పనులకు మాత్రం గ్రహణం పట్టుకుంది. ప్రభుత్వాలు మారినా పనుల్లో ఏ మాత్రం పురోగతి కనిపించడం లేదు. నిధుల కేటాయింపులో ఏళ్లుగా నిర్లక్ష్యం జరుగుతోంది. రకరకాల కారణాలతో తోళ్ల పరిశ్రమ నిర్మాణ ఆంశం మరుగునపడుతోంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కూడా పనులకు శాపంగా మారుతోంది. పార్కు అందుబాటులోకి వస్తే బతుకులు బాగుపడుతాయని ఆశించిన చర్మకారులకు నిరాశే ఎదురవుతోంది. ఏళ్లుగా రోడ్ల పక్కనే కులవృత్తిని చేసుకుంటూ కష్టాల కడలిలో కాలం వెళ్లదీస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని లెదర్ పార్కు నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని చర్మకారులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా అంటే గల్ఫ్ దేశాలకు వలసలు అధికంగా ఉండే జిల్లా అని పేరు. చేసేందుకు పనులు లేక ఉపాధి కోసం పురుషులు కుటుంబాలను వదిలి దూర దేశాలకు వెళితే, మహిళలు బీడీలు చుడుతుంటారు. అదే సమయంలో ఈ జిల్లాలో చర్మకారుల సంఖ్య కూడా ఎక్కువ. రోడ్ల పక్కన ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వీరు చెప్పులు కుట్టుకుంటూ బతుకుతుంటారు. అలాంటి వారి బతుకుల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో లెదర్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే 23 ఏళ్లు గడిచినా ఇప్పటికీ పార్కు అందుబాటులోకి రాని దుస్థితి దాపురించింది. రాష్ట్రాలు, పాలకులు మారినా లెదర్‌పార్కు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ఎన్నికలు వచ్చినప్పుడు కొంత పనిచేయడం ఆ తర్వాత అర్థాంతరంగా వదిలేయడం పరిపాటిగా మారుతోంది. పనుల్లో భాగంగా కట్టిన కొన్ని భవనాలు సైతం నిరుపయోగంగా మారాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2001-03 మధ్య కాలంలో చర్మకారుల ఉపాధికి పెద్దపీట వేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జిల్లాల్లో లెదర్‌పార్కుల ఏర్పాటుకు స్థలాన్ని, నిధులనూ కేటాయించింది. తెలంగాణలో 18 లెదర్ పార్క్‌లను ప్రతిపాదించగా అందులో ఆర్మూర్ ఒకటి. దీనికి జిరాయత్ నగర్ యానంగుట్ట ప్రాంతంలో 28 ఎకరాలు కేటాయించారు. చర్మకారులకు శిక్షణ ఇవ్వడానికి ఒక షెడ్డు నిర్మించారు. కుట్టు మిషన్?లు తెప్పించారు. కొంత మందిని ఎంపిక చేసి చెన్నైలోని ఫుట్‌పార్క్ శిక్షణ సంస్థల్లో, మరికొందరికి హైదరాబాద్‌లో చెప్పులు, బ్యాగులు తదితర చర్మ ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇప్పించారు. ఆ తర్వాత ప్రభుత్వాలు మారినా మిగతా నిర్మాణాలు పూర్తి కాలేదు. కట్టిన షెడ్డును కూడా వినియోగంలోకి తీసుకురాలేదు.

**నాణ్యత లోపించిందన్న స్థానికులు**

ఆర్మూర్ లెదర్‌పార్క్ నిర్మాణానికి 2021-22 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు, కేంద్రం మరో రూ.2 కోట్ల నిధులను కేటాయించింది. అదే సంవత్సరం లిడ్‌క్యాప్ ఎండీతో పాటు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ సంచాలకులు, ఇతర అధికారులు వచ్చి పరిశీలించారు.

## కనుల పండువగా మొదలైన గోల్కొండ బోనాలు

-మొదటిపేజీ తరువాయి

కేటాయించింది. బోనాలను సమర్పించేందుకు వచ్చిన భక్తులతో గోల్కొండ కోట కిటకిటలాడుతోంది. గోల్కొండ బోనాల వేడుకల్లో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు జగదాంబిక అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టు వస్త్రాలు, బోనం సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పోతురాజుల విన్యాసాల్లో ఉత్సాహంగా పాల్గొని, చేతిలో కొరడా పట్టుకుని నృత్యం చేయడం అందరినీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

కాకతీయుల కాలం నుంచి బోనాలు జరుపుతున్నారు. నిజాం కాలంలోనూ ఈ అమ్మవార్లను కొలిచేవారు. హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి సంభవించినప్పుడు నగరానికి చెందిన సైనికులు ఉజ్జయిని అమ్మవారిని మొక్కినప్పుడే తగ్గింది. అప్పటి నుంచి గోల్కొండ బోనాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భక్తులు గోల్కొండకు వచ్చి బోనాలను సమర్పిస్తుంటారు

బోనాలు ప్రారంభమైన మట్నదటిరోజే వ్రీ ఈటల రాజేందర్ వచ్చి మట్నక్కులు చెల్లించుకొని, ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే బోనాల పండగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక మహోత్సవమని ఈటల కొనియాడారు. మంచి వర్షాలు కురిసి, పాడి పంటలతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకొనే సంప్రదాయం తెలంగాణలో ఉంది. రాబోయే తరాలకు కూడా ఈ సంప్రదాయం కొనసాగించే ప్రయత్నమే ఈ బోనాల జాతర. గోల్కొండ బోనాల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను

2 వేల మంది బందోబస్తు : ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 2 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనర్ తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రామ్‌దేవ్‌గూడ, లంగర్‌హౌస్, బంజారా దర్వాజా తదితర మార్గాల్లో రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు ఉంటాయని సీపీ తెలిపారు. లక్షలాది మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో చైన్ స్నాచింగ్, పిక్‌పాకెటింగ్ వంటి నేరాలను నివారించేందుకు హైదరాబాద్ పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు. నగరంలోని మోస్ట్ వాంటెడ్ చైన్ స్నాచర్ల ఫొటోలతో ప్రత్యేక హెచ్చరిక బ్యానర్లను రూపొందించి ప్రధాన కూడళ్లలో ప్రదర్శించారు. ఆభరణాలు, నగదు, ఫోన్ల విషయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## 'బుల్లెట్' గుబులు!

-మొదటిపేజీ తరువాయి

శివారుల్లో బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి రానుందనే దానికి మరింత బలం చేకూరింది. దీనికితోడు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని బహదూర్‌గూడ వద్ద బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం 600 ఎకరాల భూమిని కేటాయించింది. ఇక్కడినుంచే మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే శంషాబాద్-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-అమరావతి-చెన్నై కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. ఇందులో ముంబయి మార్గానికి సంబంధించి బహదూర్‌గూడ వద్ద మొదలై మొయినాబాద్, చేవెళ్ల, వికారాబాద్ మీదుగా కారిడార్‌ను నిర్మాణం చేస్తారు. పదిరోజులుగా దీనికి సంబంధించి రైల్వే యంత్రాంగం వేగంగా మార్కింగ్‌లు వేస్తున్నారు. శంషాబాద్ మండలంలోని చౌదరిగూడ, కేబీదొడ్డి, సుల్తాన్‌పల్లి గ్రామాలతో పాటు మొయినాబాద్ మండలంలోని సురంగల్, కేతిరెడ్డిపల్లి, అమ్డాపూర్ కూడళ్లల్లో మార్కింగ్‌లు వేశారు. ఎలాంటి మూలమలుపులు లేకుండా ప్రతి 5 కిలో మీటర్లకు ఒక చోట మార్కింగ్ వేస్తున్నారు. ఈ మార్కింగ్‌లు పచ్చటి పంట పొలాల మధ్య నుంచే వస్తుండటంతో రైతులు తమ భూములు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగు వరుసల్లో**

ప్రస్తుతం మార్కింగ్ ఇస్తున్న బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని నాలుగు వరుసల్లో నిర్మిస్తారని తెలుస్తోంది. ఇందుకోసం సుమారుగా 300 అడుగుల వెడల్పుతో భూసేకరణ చేసే అవకాశం ఉంది. ఆయా మార్గాల్లో చిన్న, సన్నకారు రైతుల భూములే ఎక్కువగా ఉండటం సమస్య ఏర్పడటానికి కారణమవ్వొచ్చు. ఒకవేళ ఇదే కార్యరూపం దాలిస్తే భూములు కోల్పోయే రైతులకు ఎంత మేర పరిహారం అందుతుందనే దానిపై స్పష్టత లేదు. రెవెన్యూ అధికారులకు సైతం రైల్వేశాఖ నుంచి ఈ విషయంలో స్పష్టత లేదు. బుల్లెట్ ట్రైన్ మార్గానికి ఇరువైపులా సర్వీసు దారులను సైతం అందుబాటులోకి తెచ్చే అవకాశం కనిపిస్తోంది. శంషాబాద్ మండలం కేబీదొడ్డి గ్రామం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం కూడా ఉంది.

## ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.


## రైతులకు కరెంట్ ఇవ్వకపోగా భూములపై ట్యాక్స్ వేస్తారట..

రిటైర్డ్ ఇంజినీర్లు, తెలంగాణ సాగునీటి పారుదల శాఖ మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి గేట్లు ఎత్తొచ్చని చెప్తే.. ఆ నీళ్లు ఎత్తొచ్చని చెప్పిన ఇంజినీర్లను జైళ్లలో పెడతమని, బెల్ట్‌తో కొడ్తమని రాజకీయాలు చేస్తున్నది మీరని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతులకు నీరందంచండి..కరెంట్ ఇవ్వండి..విద్యుత్ సామర్థ్యం ఉన్నది.. విద్యుత్ ప్లాంట్లు ఉన్నయి. బొగ్గు లేక విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. దృష్టి పెట్టండి అని ప్రభుత్వాన్ని ముల్లు కట్టె పెట్టి నిద్రలేపుతున్నాం. మీకు విషయాలు చెబుతున్నమన్నారు. రాజకీయాలు చేయడం మీరు మానండి.. విద్యుత్ ఉత్పత్తి పెంచండి.. రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వండని ప్రభుత్వానికి హరీశ్ రావు సూచించారు.. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ చేస్తారట. కమీషన్ల కోసం గ్రీన్ ఎనర్జీ పాలసీని నిలిపేశారు. నాణ్యమైన బొగ్గును వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. దేవాదులకు నీళ్లు అందడానికి కారణం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కోతలు-వాతలు తప్ప ఏమీ లేవన్నారు. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ వేస్తారట. రైతులకు నీళ్లు ఇవ్వమంటే రక్తం పారిస్తామంటున్నారు. రెండు పంటలకు బోనస్ ఎగ్గొట్టారు. విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారు. విద్యుత్ సామర్థ్యం ఉన్నా ఉత్పత్తి చేయలేకపోతున్నారు.

మన తొలివెలుగు


# అమెరికా యూ టర్న్...

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలనే ప్రతిపాదనలను అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఇది భారత్, చైనాకు ఊరట కలిగించే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాలో ప్రవేశపెట్టిన రష్యా ఆంక్షల బిల్లును సవరించారు. ప్రతిపాదిత గరిష్ట సుంకాన్ని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఈ బిల్లు చట్టంగా మారితే, భారత్ వంటి ప్రధాన రష్యన్ చమురు దిగుమతిదారులకు మేలు జరగనుంది. ఇప్పటి వరకు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలగవచ్చు. రిపబ్లికన్– డెమోక్రటిక్ చట్టసభ సభ్యులు మంగళవారం రష్యా ఆంక్షల బిల్లు సవరించిన ప్రతిని ప్రవేశపెట్టారు. ఈ కొత్త ముసాయిదా, రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై గరిష్టంగా 100 శాతం సుంకాన్ని విధించాలని ప్రతిపాదిస్తోంది. గతంలో, ఈ బిల్లు అటువంటి అన్ని దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలని కోరింది. అగ్రరాజ్యం అమెరికాకు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక భారత్‌కు మొదలైన కష్టాలు ఇంకా కొనసాగుతున్నాయి. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో భారత్ ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొటోంది. అమెరికా వెళ్లేవారు ఇబ్బంది పడుతన్నారు. ఇక ప్రతీకార సుంకాలు భారత వ్యాపార ఎగుమతులను దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికే అనేక కారణాలతో దిగుబతులపై 25 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు అమలు అవుతున్నాయి. తాజాగా రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపి ట్రంప్ చట్ట సవరణ తీసుకురాబోతున్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసే దేశాలపై విధించాలనుకున్న సుంకాల గరిష్ట పరిమితిని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించారు. ఈ బిల్లు రష్యా నాయకులు, ఆర్థిక సంస్థలు, ఇంధన సంబంధిత ప్రాజెక్టులను నేరుగా లక్ష్యంగా చేసుకుంటుంది. ఈ చట్టం (శాంక్షనింగ్ రష్యా యాక్ట్)ను ఇటీవల మరణించిన సెనేటర్



లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించారు. దీని ద్వారా అధ్యక్షుడికి రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం లభిస్తుంది. మొదట్లో దీనిని ఆర్థికంగా బలహీనపరిచే శక్తివంతమైన చర్యగా అభివర్ణించారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో సుంకాల పరిమితిని 100 శాతానికి తగ్గించి సవరించారు. ఈ మార్పులకు ప్రభుత్వ, వ్యతిరేక పక్షాల నుంచి మద్దతు లభించింది. గ్రాహమ్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు యుద్ధానికి పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నాయని ఆరోపించారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఆ దేశాలు రష్యా ఇంధనం కొనకుండా అడ్డుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. సవరించిన రూపంలో ఈ నిబంధనలు మిత్రరాజ్యాలకు అనుకూలంగా ఉన్నాయి. లక్ష్యంగా మారే దేశాల్లో చైనా, భారత్, స్లోవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ ఉన్నాయి. రష్యా సహజ వాయువును దిగుమతి చేసుకునే ప్రధాన దేశాల్లో చైనా, ఫ్రాన్స్, జపాన్, హంగరీ, బెల్జియం ఉన్నాయి. రష్యా వాయువు ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసి, సరఫరాలను తగ్గించే చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ బిల్లులో మినహాయింపులు ఇచ్చారు. ఇది జపాన్, ఫ్రాన్స్‌కు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. మధ్యప్రాచ్యంలో సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు అమెరికా రష్యా ఇంధనంపై మినహాయింపులు ఇచ్చింది. ప్రస్తుతం ఆ మినహాయింపులను తొలగించే యోచనలో ఉంది. ట్రంప్ పిచ్చి చేష్టలతో మళ్లీ చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది. రష్యా నుంచి ముడి చమురును అత్యధికంగా కొనుగోలు చేసే దేశాల్లో భారత్, చైనా ఉన్నాయని అమెరికా భావిస్తోంది. సవరించిన బిల్లు ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలకు మాత్రమే గరిష్ట సుంకాలు వర్తిస్తాయి. గతంలో, ఈ నిబంధన దిగుమతి చేసుకునే అన్ని దేశాలకు వర్తించేది. ఈ బిల్లును దివంగత రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం, డెమోక్రటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ ప్రవేశపెట్టారు. సవరించిన ఈ బిల్లుకు రిపబ్లికన్,డెమోక్రటిక్ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సెనేట్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం 26 మంది చట్టసభ్యులు ఈ బిల్లుకు సహ–ప్రాయోజకులుగా ఉన్నారు. ఇది కాంగ్రెస్‌లో ముందుకు సాగే కొద్దీ మరింత మద్దతు

# విద్యార్థులపై త్రిభాషా భారం



మూడు భాషల విధానం దేశంలో మరోసారి వివాదాల తుఫాన్ రేపుతున్నది. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ దృక్పథం, అమలులో లోపాలు, సమాఖ్య విలువలపై ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ముఖ్యంగా సీబీఎస్ఈ ద్వారా 9వ తరగతి నుంచి మూడో భాషను తప్పనిసరి చేయాలనే నిర్ణయం తీవ్ర విమర్శల పాలవుతున్నది. ఇప్పటికే బోర్డు పరీక్షల బెంగతో విద్యార్థులు నలిగిపోతున్నారు. ఉన్నపళంగా త్రిభాషా సూత్రం అమలు చేయడం వారిని మరింత కృంగదీసే అవకాశం ఉన్నది. 'భాష నేర్చుకోవడం ఎప్పుడూ వృథా కాదు' అని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ, అదే సమయంలో 9వ తరగతి వంటి కీలక దశలో కొత్త భాషను రుద్దడం విద్యార్థులపై మానసిక భారం అవుతుందని హెచ్చరించడం గమనార్హం. కేంద్రం, సీబీఎస్ఈ నిర్ణయాల్లోని అసంబద్ధతను సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు స్పష్టంచేస్తున్నాయి. దేశవ్యాప్తంగా భాషా, సాంస్కృతిక, సామాజిక స్థితిగతుల్లో ఎంతో వైవిధ్యం ఉన్నది. వాటన్నిటినీ కాదని ఒకే విధానాన్ని అన్ని రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నం జరుగుతున్నది. ఉపాధ్యాయుల కొరత, పాఠ్యపుస్తకాల లభ్యత, మౌలిక సదుపాయాల లోపం వంటి ప్రాథమిక సమస్యలు పరిష్కరించకుండా, మూడో భాషను తప్పనిసరి చేయడం విద్యార్థులపై ప్రయోగాలు చేయడం తప్ప మరొకటి కాదు. విధాన రూపకల్పనలో క్షేత్రస్థాయి వాస్తవాలను పట్టించుకోకపోవడం మంచిది కాదు. సీబీఎస్ఈ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే విధానాన్ని అమలు చేయాలనే పట్టుదల భారత సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తున్నది. సంస్కృతి, గుర్తింపు, ఆత్మగౌరవానికి ప్రతీక భాష. అలాంటి సున్నితమైన అంశాన్ని కేంద్రం ఒక పరిపాలనా ఉత్తర్వుగా చూడడం, రాష్ట్రాల భావోద్వేగాలను తక్కువ అంచనా వేయడమే. కేంద్ర ప్రభుత్వ దృక్పథం మొదటి నుంచీ ప్రశ్నార్థకమే. జాతీయ ఐక్యత పేరుతో భాషా విధానాలను ముందుకు తెస్తున్నప్పటికీ, అవి ప్రాంతీయ భావోద్వేగాలను గౌరవించేలా ఉన్నాయా? అనేది సమస్య. మహారాష్ట్ర, బెంగాల్‌తోపాటుగా దక్షిణాది రాష్ట్రాల్లో భాషాపరమైన ఆత్మాభిమానం ఎక్కువ. తమిళనాడు వంటి రాష్ట్రాలు త్రిభాషా విధానాన్ని భాషా దౌర్జన్యంగా భావిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నాయి. మూడు భాషల విధానం పేరుతో కేంద్రం అమలు చేస్తున్నది భాషా సమతుల్యత కాదు, హిందీ ఆధిపత్యాన్ని నెమ్మదిగా నెత్తిన ఎక్కించే వ్యూహమనే అనుమానం అంతకంతకూ పెరుగుతున్నది. బీజేపీకి హిందీ పట్ల గల ప్రత్యేక అభిమానం చిరపరిచితమే. 'ఒకేదేశం, ఒకే ఎన్నిక' తరహాలో 'ఒకే భాష', అంటే హిందీని దేశమంతటా రుద్దడం, వారి ఎజెండాలోని ప్రముఖ అంశాల్లో ఒకటి. 'ఐచ్ఛికం' అంటూనే బలవంతంగా రుద్దడం, 'ఐక్యత' పేరిట ఏకరూపత తేవడం విద్యాసంస్కరణ కాదు, సంస్కృతిపై దాడి అనే విమర్శలూ తీవ్రమవుతున్నాయి. మరోవైపు దేశంలో ఇంగ్లిష్ భాష స్థానం ఏమిటనే విషయంలో నెలకొన్న అయోమయం మరో కీలకమైన అంశం. సుప్రీంకోర్టు కూడా ఇంగ్లిష్‌ను భారతీయ భాషగా పరిగణించవచ్చా? అనే ప్రశ్నను లేవనెత్తింది. భాషా విధాన రూపకల్పనలో ఉన్న అస్పష్టతను ఇది బయటపెడుతున్నది. ఒక విధానం అమలుచేసే ముందు దాని మూల సూత్రాలపై స్పష్టత లేకపోతే, అది ఎలా విజయవంతమవుతుంది? మూడు భాషల విధానం సమతుల్యత సాధించే ప్రయత్నంగానే మొదటినుంచీ ప్రచారం జరుగుతున్నది. కానీ ప్రస్తుతం అది రాజకీయ ప్రయోజనాలకు వేదికగా మారుతున్నది. విద్యార్థుల ప్రయోజనాలు, ఉపాధ్యాయుల సామర్థ్యాలు, ప్రాంతీయ వాస్తవాలు ఇవన్నీ కూడా పక్కనపెడుతున్నారు. సీబీఎస్ఈ, కేంద్రం కలిసి విద్యను ఒక ప్రయోగశాలగా మార్చుతున్నాయనే విమర్శలు తోసిపుచ్చదగ్గవేమీ కాదు. మూడు భాషల విధానం విద్యార్థుల అభివృద్ధికి కాకుండా, కేంద్ర విధానాల వైఫల్యానికి ప్రతీకగా మిగిలిపోతుంది.

# లక్ష్య రాజకీయాలు-కక్ష రాజకీయాలు



'ఇప్పటి వరకు మా రాష్ట్ర ప్రతిపత్తి కోసమే ఉద్యమం జరిగింది. అది ఎవరి మీదనో కోపంతోనో, కక్షతోనో కాదు. తెలంగాణలో స్థిరపడ్డ ఆంధ్రులు నిర్భయంగా ఉండవచ్చు. వారు తెలంగాణ ప్రజలతో సమానంగా పరిగణింపబడుతారు. ఇక మీదట మన రెండు రాష్ట్రాలు సమస్యలు పరిష్కరించుకొని అభివృద్ధి సాధిద్దాం' ఇదీ 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే ఉద్యమ నాయకుడు, రాష్ట్ర సాధకుడు కేసీఆర్ చేసిన ప్రకటన. ఎంతో హుందాగా, గౌరవప్రదంగా ఆ రోజు ఆయన మాట్లాడిన మాటలు ఆంధ్ర రాజకీయ నాయకులకు గానీ, తెలంగాణలో వ్యాపారాలు, ఉపాధి ఏర్పరుచుకొని సంపన్నులైన ఆంధ్రా వాళ్లకు గానీ అర్థం కాలేదనిపిస్తున్నది. లేకపోతే కేసీఆర్ విశాల భావాల స్థాయిలో వారు లేరేమో అనిపిస్తున్నది. వలస పాలకుల విధ్వంసాన్ని సరిచేసి, తెలంగాణలో ప్రశాంతత, అభివృద్ధి సాధించి అన్ని రంగాల్లో తెలంగాణ ముందంజ వేయాలన్న లక్ష్యంతో 2001 నుంచి రాష్ట్రంలో మూలమూల తిరిగి ఉద్యమాన్ని నిర్మించిన నాయకుడు కేసీఆర్. తెలంగాణ పునర్నిర్మాణం కోసం కూడా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సహా మేధావులు, నిపుణులతో చర్చించి, పటిష్టమైన ఎజెండాను తయారు చేశారు. రక్తం బొట్టు చిందకుండా ఉద్యమాన్ని సాగించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిమిషం కూడా వృథా చేయకుండా పాలనలోకి దిగారు. అందరినీ కలుపుకొనిపోతూ 'లక్ష్య రాజకీయాలు' చేసి ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించాలనేది ఆయన సిద్ధాంతం. అయితే, అప్పటివరకు తెలంగాణలో అన్ని రంగాల మీద ఆధిపత్యం సాధించిన, సామాన్య ప్రజలకు ఇక్కడి వనరులు, సంపద అందకుండా చేసిన ఆంధ్ర పాలకులు ఎట్లా ప్రవర్తించారు? విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికలు గెలిచి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబునాయుడు అక్కడ డిస్కమ్‌లు ఆపేసి, తెలంగాణకు కరెంట్ రాకుండా చేశాడు. తెలంగాణకు చెందిన ఏడు మండలాలను బలవంతంగా లాక్కొని రకరకాలుగా కక్ష సాధించాడు. అంతేకాకుండా, కొత్త రాష్ట్రం పురిటిలో నుంచి బయట పడకుండానే కుట్ర రాజకీయాలు నడిపి, తెలంగాణ ప్రభుత్వాన్ని పడదొయ్యడానికి యత్నించాడు. 'పకోడీలు చేసేవాడికి అవే చేతనైతాయి, పులిహోర చేయలేడు' అన్నట్టుగా మోసపూరిత విధానంలో పిల్లనిచ్చిన మామను పడదోసి, సొంత మనుషులను వంచించి పీఠమెక్కిన వాడు చంద్రబాబు. అలాంటి నాయకుడు సరైన రాజకీయాలు చేస్తాడా? అవే విధానాలు 2014 నుంచి ఈ రోజు వరకు కూడా పాటిస్తున్నాడు. వేదకాలంలో కూడా ఆధ్యాత్మికవేత్తలు, వివిధ రంగాల్లోని నిపుణులు, సమాజంలోని విద్యావంతులైన స్త్రీలు, పురుషులు కలిసి తమ పాలకుడిని ఎన్నుకొనేవారు. ఆ వ్యక్తి 'ఉన్నత విద్యావంతుడు, నైపుణ్యాలు కలిగినవాడు, ధర్మాన్ని ఆచరించేవాడు, విద్వాంసుడు, నిజాయితీ, నిబద్ధత కలిగినవాడు, బాధ్యతగా, నిష్పక్షపాతంగా పాలించగలిగే ఉన్నత భావాలు కలిగినవాడు, ప్రజలను ఉత్సాహపరుస్తూ, వారి అభివృద్ధికి పథకాలు రచించి అందించేవాడు, ప్రజల వ్యక్తిగత అభివృద్ధి, సమాజ శ్రేయస్సు తన లక్ష్యాలుగా కలిగినవాడు అయి ఉండాలి' ఇటువంటి మంత్రాలు వేదాల్లో వేల సంఖ్యలో ఉన్నాయి. అవి పాలకుడికి చక్కటి మార్గాన్ని సూచిస్తాయి. సమస్యలకు పరిష్కారాలను చూపుతాయి. ఆ తరహాలో జూన్ 2014 నుంచి నవంబర్ 2023 వరకు కేసీఆర్ సారథ్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గెలిచిన రాజకీయ నాయకులే కాక, స్థానిక తెలంగాణ నాయకులు ప్రభుత్వ విరోధులుగా ప్రవర్తించినప్పుడు, ప్రజాహితం, ప్రజా సంక్షేమం కాకుండా, ఎన్నికైన ప్రభుత్వాన్ని అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నప్పుడు, ధ్వంసమైన రాష్ట్రాన్ని అతి తక్కువ కాలంలో అంత అభివృద్ధి చేయగలగడం ఇంకెవరికైనా సాధ్యమయ్యేదా? కానీ కేసీఆర్ మొక్కవోని ధైర్యంతో, సకారాత్మక ఆలోచనలతో సర్వశక్తులు వెచ్చించి, రాష్ట్రంలో సామాన్య ప్రజలకు వ్యవసాయం, విద్యుత్తు, తాగునీరు, పల్లెల్లో కూడా అన్ని రకాల సదుపాయాలు, సాంకేతిక అభివృద్ధి సాధించి కేంద్రం ఇచ్చే 16 అవార్డుల్లో 13 తెలంగాణకు దక్కేటట్టు కృషి చేశారు.

తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాల్సిన సునిశితమైన విషయం ఒకటుంది. తెలంగాణలో అధికారం చేజిక్కించుకొన్న కాంగ్రెస్‌కు, కేసీఆర్ అంటే అసూయ, కక్ష సహజ లక్షణాలుగా కలిగిన తెలుగుదేశం పార్టీకి, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విపక్ష పార్టీలను, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలను నాశనం చేసేందుకు అనైతిక మార్గాలు కూడా నిస్సిగ్గుగా అమలు చేస్తున్న బీజేపీకి, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కంటే తమ మేధ గొప్పదని నిరూపించుకోవాలన్న తాపత్రయం కలిగిన నకిలీ మేధావులకు (ఈ గుంపులో ప్రొఫెసర్లు, జర్నలిస్టులు, విద్యావంతులు కూడా ఉన్నారు). 2023 ఎన్నికల ముందు నుంచీ నేటికీ వారందరికీ ఒక్కటే లక్ష్యమయింది. అదే కాళేశ్వరం. తెలంగాణ శత్రువులకు కాళేశ్వరం ప్రాజెక్టు కండ్ల మంటలు ఎందుకు కలిగిస్తున్నదో ఆలోచించాలి, అర్థం చేసుకోవాలి. మేడిగడ్డ బరాజ్‌లో కేవలం రెండు పిల్లర్లు కొద్దిగా కుంగితే, వాటిని సరిచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే ఆదేశాలివ్వని ఎన్‌డీఎస్ఏకు, రెండున్నరేండ్ల తర్వాత మిగతా స్తంభాలు– అన్నారం, సుందిళ్ల దగ్గర కుంగుతాయని రిపోర్ట్ ఇచ్చే అర్హత ఉన్నదా? మేడిగడ్డలోని రెండు పిల్లర్ల దగ్గర ఈ రెండేండ్లు ప్రభుత్వం ఇసుకను తోడించిందన్న రిపోర్టులు ఉన్నాయి. సాక్ష్యం చెప్పే వాళ్లు కూడా ఉన్నారు. ఎవరైనా ఒక బరాజ్ పిల్లర్ల వద్ద ఇసుక తవ్వవచ్చా? ఎందుకు తవ్వారు? ఆ పిల్లర్లు ఇంకా కుంగాలనే కదా! మరి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కక్ష, నిర్లక్ష్యం అందరికీ కనపడటంలేదా? రేవంత్‌రెడ్డి ఇట్లా తెలంగాణ వ్యతిరేక ప్రణాళికలు మిగతా రంగాల్లో కూడా అమలు చేస్తున్నారు. అయితే కాళేశ్వరాన్ని భ్రష్టు పట్టించాలన్న పట్టుదల చంద్రబాబుకు, మోదీకి కూడా ఎందుకు? కారణాలు వెతకడం కష్టం కాదు. మోదీ రాజకీయ లక్ష్యం విపక్ష పార్టీలు, ముఖ్యంగా వివిధ రాష్ట్రాల్లో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీల నాశనం. బెంగాల్‌లో ఎన్నికైన తర్వాత 5,000 ఈవీఎంలు తగలబెట్టారంటే అక్కడ బీజేపీ ఏ రకంగా అనైతిక విజయం సాధించిందో అర్థమవుతున్నది కదా! మోదీది రాజకీయ లక్ష్యమైతే, చంద్రబాబుది వ్యక్తిగత అసూయ. తెలంగాణ రాష్ట్రం తమ కబంధ హస్తాల నుంచి పోయిందన్న కక్ష. చంద్రబాబు అక్రమ ఆస్తులు తెలంగాణలోనే ఉన్నాయి. చంద్రబాబుకు ప్రజల క్షేమం పట్టదు, ఇక్కడ సంపద దోచుకోవడమే ఆయన లక్ష్యం. విభజన తర్వాత ఏపీకి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఐదేండ్ల పాలనలో అమరావతి సినిమా సీడీలు ప్రజలకు చూపించాడే తప్ప, రాజధాని కట్టలేదు, కట్టలేడు కూడా. ప్రపంచంలో కాళేశ్వరం ఎనిమిదో వింత అని విదేశీయులు సైతం పొగిడారు.

అలాంటి ప్రాజెక్టు తెలంగాణకు ఉంటే చంద్రబాబు సహించగలడా? ఆంధ్రను అభివృద్ధి చేయాలన్న కోరిక లేదు కానీ, తెలంగాణను నాశనం చేయాలన్న లక్ష్యం మాత్రం ఆయనకు గాఢంగా ఉన్నది. తెలంగాణకు చెందిన గోదావరి జలాలు 1956 నుంచీ ఆంధ్రకు పారాయి. మరి ఇప్పుడు కాదంటే ఎలాగ? అందుకే 'హైదరాబాద్ మీ అయ్య జాగీరా?' అని కావ్ కావ్ అంటున్న చిన్న నాయకుడితో కలిపి దుష్ట చతుష్టయం తెలంగాణ ప్రాణధార అయిన కాళేశ్వరాన్ని కూల్చాలని కంకణం కట్టుకున్నది. పొరపాటో, గ్రహపాటో 57 ఏండ్లపాటు తెలంగాణ విధ్వంసమైంది. అది తెలిసి కూడా ప్రత్యేక రాష్ట్రంలోనూ ప్రజలు కాంగ్రెస్‌ను గద్దెనెక్కించారు. ఇప్పుడైనా కండ్లు తెరిచి, జ్ఞానం తెచ్చుకొని ఉద్యమం చేసైనా కాళేశ్వరాన్ని కాపాడుకోకపోతే, రేపు సింగరేణిని అదానీకి, భద్రాచలం రాముడు, యాదాద్రి నరసింహుడు బీజేపీ దోపిడీకి, మిగతా వనరులను కక్షపూరిత ఆంధ్ర పాలకులకు వశమైపోతాయి. తెలంగాణ ప్రజలు మేలుకోవాలి.

## రోహింగ్యాలను తిరిగి వారి దేశానికి పంపాలి

**అన్ని పార్టీలు బీజేపీ పోరాటానికి మద్దతు ఇవ్వాలి**



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న రోహింగ్యాలను తిరిగి వారి దేశానికి పంపాలని అన్ని పార్టీలు బీజేపీ పోరాటానికి మద్దతు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నేత కొలన్ శంకర్ రెడ్డి అన్నారు. తల్లీ భారతికి జై అంటూ దేశభక్తి గల ముస్లింలను , క్రైస్తవులను బీజేపీఎపార్టీ హిందువులతో సమానమనే భావిస్తుందని బీజేపీ రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి అన్నారు, పాకిస్టాన్, బంగ్లాదేశ్, బర్మా, మాయమ్మార్ రోహింగ్యాలను 2002 లో భారత్ లో తెచ్చి పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని దీనికి ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ లు శరణార్థుల పేరిట అడ్డాగా మార్చింది కాంగ్రేస్ అని ఈ విషయాన్ని అందరూ తెలుసుకోవాలని అన్నారు, ఎంఐఎం, ఎంబీటీ లు మతతత్వమును రెచ్చగొడుతున్నాయని తెలిపారు. వీటికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ లు ఓట్ల కోసం మద్దతు ఇస్తున్నాయని అన్నారు. తక్షణమే రోహింగ్యాలను తిరిగి వారి దేశాలకు పంపేందుకు బీజేపీ చేస్తున్న పోరాటానికి కాంగ్రేస్, బీ ఆర్ ఎస్ పార్టీలు మద్దతు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## జల్ పల్లి సర్కిల్ కి మొండి చేయి

**బోనాల ఉత్సవాలకు 3000 ఆలయాలకు ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు**

**జల్ పల్లి సర్కిల్ కి మాత్రం గుండు సున్నా**



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** జల్ పల్లి సర్కిల్ దేవాలయాల అభివృద్ధిలో జీహెచ్ఎంసీ వివక్ష చూపిస్తుందని బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ?బోనాల ఉత్సవాలకు 3000 ఆలయాలకు ప్రభుత్వం రూ. 20 కోట్లు ఇచ్చినా జల్ పల్లికి మొండిచేయి చూపించిందని జల్ పల్లి సర్కిల్ బీజేపీ నాయకులు ?యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీజేపీ నాయకుల పెరమోని నరేష్ యాదవ్, గుర్జని గణేష్ గౌడ్, ఎండీ నయీమ్ అడ్వకేట్ ఆరోపించారు. బుధవారం మామిడిపల్లిలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆషాడ బోనాల జాతరను పురస్కరించుకుని జీహెచ్ఎంసీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో శంషాబాద్ జోన్, జల్ పల్లి సర్కిల్ పరిధిలోని దేవాలయాలపై అధికారులు తీవ్ర వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోనాల జాతర ఉత్సవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దాదాపు 3000 దేవాలయాల అభివృద్ధికి రూ. 20 కోట్ల నిధులను మంజూరు చేసిందని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని చార్మినార్, రాజేంద్రనగర్ జోన్లలోని ఆలయాలకు ఇప్పటికే నిధులు కేటాయించి, టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారని తెలిపారు. అయితే అదే మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న శంషాబాద్ జోన్, జల్ పల్లి సర్కిల్‌ను మాత్రం అధికారులు పూర్తిగా విస్మరించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఒకే నగర పాలక సంస్థలో ప్రాంతాల వారీగా సవతి ప్రేమ ప్రదర్శించడం సరికాదని మండిపడ్డారు. ?తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల జాతరలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జల్ పల్లి, శ్రీరామ్ కాలనీ, మామిడిపల్లి, రంగనాయకుల కాలనీ, పహాడీషరీఫ్, కొత్తపేట్, ఎర్రకుంట పరిధిలోని హిందూ దేవాలయాల వద్ద యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేయాలన్నారు. ?ఈ వివక్షపై శంషాబాద్ జోనల్ కమిషనర్ తక్షణమే స్పందించి, ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జల్ పల్లి సర్కిల్‌కు నిధులు రాబట్టాలని కోరారు. లేని పక్షంలో భక్తులను కలుపుకొని బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ?ఈ సమావేశంలో బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో భార్యపై దాడి

**నిందితుడికి 5 రోజులు జైలు శిక్ష**



**మన తొలివెలుగు, చాంద్రాయ ణగుట్ట ప్రతినిధి శైలేష్ కుమార్ :** మద్యం సేవించి భార్యపై దాడి చేసిన ఘటన ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్. కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తన భర్త ప్రతిరోజు మద్యం సేవించి వచ్చి తనను కొడుతున్నాడని బాధిత మహిళ చత్రినాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ గౌస్ ఉద్దీన్ విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో నిందితుడు సీ. పోచయ్య (44) ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన 9వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పీ. నర్సింగ్ నిందితుడికి ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు.

## ఎం.సీ.ఆర్ కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చేయించాలని ఎమ్మెల్యే కు వినతి



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్** ఎం. సీ. ఆర్ కాలనీలో చాలా కాలం నుంచి డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని సమస్యకు శాశ్వత పరిష్కారం చేయించాలని మాజీ కార్పోరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి, ఎంసీఆర్ కాలనీ అధ్యక్షులు సురేష్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ కాలనీలో చాలా రోజుల నుంచి డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. గతంలో అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ ఫోన్ చేసి సమస్యపై మాట్లాడారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సాయిరాం, అరుణ్ , వెంకట్ నర్సింగ్ ,శర్వాన్ ,అంజి, హేమ విజయ రాధ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

**సర్ గడువు పొడగింపును వినియోగించుకోవాలి**

**ఆన్ లైన్ దరఖాస్తు పూర్తి చేస్తే ఎన్యూమరేషన్ ఫామ్ అవసరం లేదు**



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) గడువును మరో 10 రోజులు పొడగించటంపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జూలై 24 నుంచి ఆగస్టు 3 వరకు గడువును పొడగించటం వల్ల ప్రతీ ఓటర్ తమ ఓటును అప్ డేట్ చేసుకోవాలని కే ఎల్ ఆర్ సూచించారు. తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. తప్పులు లేకుండా ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపి బీ.ఎల్.ఓ లకు ఇవ్వాలని కోరారు. ఆన్ లైన్ దరఖాస్తు చేసుకున్న వారు మ్యానువల్ గా ఎన్యుమరేషన్ ఫామ్స్ నింపాల్సిన పని లేదని లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ఆగస్టు10న ప్రచురించనున్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించి సెప్టెంబర్ 9 వరకు సవరణలు, కొత్త దరఖాస్తులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా విడుదల చేస్తారని కిచ్చెన్నగారు తెలిపారు. డిజిటలైజేషన్ ఇప్పటి వరకు 50 శాతానికి పైగా పూర్తి అయిందన్నారు. మిగతా ఓటర్లు సైతం ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేసి ఇవ్వటం, ఆన్ లైన్ దరఖాస్తులను పూర్తి చేసి ఓటును కాపాడుకోవాలని కే ఎల్ ఆర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ బీ.ఎల్.ఏ లు ఆగస్టు 3 వరకు అప్రమత్తంగా ఉండి ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించి బీ.ఎల్.ఓ లకు సహకరించాలని కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు.

## యాదగిరిగుట్ట దేవస్థానం పాలకవర్గంలో ధర్మకర్తగా నియమితులైన ఈశ్వరమ్మకు ఘన సన్మానం



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన యాదగిరిగుట్ట దేవస్థానం పాలక వర్గంలో ఈశ్వరమ్మ యాదవ్ కి అవకాశం కల్పించడం యాదవ జాతికి ఎంతో గర్వకారణం అని మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్, యాదవ్ నాయకులు అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ శ్రీలక్ష్మీ నరసింహస్వామి యాదగిరిగుట్ట దేవస్థానం పాలకవర్గంలో ధర్మకర్తగా నియమితులైన సందర్భంగా వారిని శాలువాలతో యాదవ గొల్లరూమాల్ తో సన్మానించి శ్రీకృష్ణ భగవాన్ జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన యాదగిరిగుట్ట దేవస్థానం పాలక వర్గంలో ఈశ్వరమ్మ యాదవ్ కి అవకాశం కల్పించడం యాదవ జాతికి ఎంతో గర్వకారణమని కొనియాడారు. అలాగే ఇటీవల జరిగిన ఈశ్వరమ్మ యాదవ్ పై సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మహిళా నాయకురాలని మరిచి నాగరికత విస్మరించి పెద్ద వయస్సులో ఉన్న మహిళా అని గ్రహించకుండా తప్పుడు వాఖ్యలు చేసి, యాదవ కులంను దూషించిన వ్యక్తులను ఎండగట్టి ఈశ్వరమ్మ కి వారి కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు మేకల కృష్ణ యాదవ్, రావిర్యాల గ్రామ మాజీ సర్పంచ్ జల్లెల లక్ష్మయ్య యాదవ్, జిల్లెలగూడ గ్రామ మాజీ ఎంపీటీసీ ఎనుగుల అనిత అనిల్ యాదవ్, యాదవ నాయకుడు పెద్దలు పోచబోయిన కృష్ణ యాదవ్ , యాదవ యువ నాయకుడు పోచబోయిన సురేష్ యాదవ్ జిల్లెల గూడ, మీర్ పేట్ యాదవ నాయకులు పెద్దలు జెనిగే జంగయ్య యాదవ్, దేవనమోని శ్రీనివాస్ యాదవ్, అబ్బనమోని గోపి యాదవ్, వట్టి శ్రీశైలం యాదవ్, కాసుల సుధాకర్ యాదవ్, ఎనుగుల శివ యాదవ్, తుమ్మల శివ యాదవ్ పాల్గొన్నారు.

## అనుమతి లేని ప్రైవేట్ స్కూల్ హాస్టళ్లపై చర్యలు తీసుకోవాలి



**లమన తొలివెలుగు మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్** మోత్కూర్ మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలల ఆవరణల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న హాస్టళ్లపై విద్యాశాఖ అధికారులు, ఉన్నతాధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ డిమాండ్ చేశారు.గురువారం మోత్కూర్ మండల కేంద్రంలోని స్థానిక కేఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హాస్టళ్లు నడపడానికి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే అక్రమంగా ఒకే బిల్డింగ్‌లో బాలబాలికలకు హాస్టల్స్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలను తుంగలో తొక్కి, విద్యాశాఖ ఉన్నతాధికారులను సైతం మోసం చేస్తూ ఈ అక్రమ హాస్టళ్లను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.నిబంధనలకు విరుద్ధంగా, కనీస రక్షణ లేకుండా హాస్టళ్లు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న సదరు ప్రైవేట్ యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఇన్వార్డులో ఏఐఎస్ఎఫ్ బృందం గురువారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్ట గౌతం, వంశీకృష్ణ, ఉప్పుల ప్రవీణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

## మొత్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మిక తనిఖీ



**మన తొలివెలుగు, మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మొత్కూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులను, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్.. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎల్లప్పుడూ పరిశుభ్రమైన వాతావరణాన్ని ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రతి రికార్డును కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రోజువారీగా ఎంతమంది రోగులు వస్తున్నారు. అవుట్ పేషెంట్ (ఓపీ ) వివరాలు, రోజువారీ మరియు నెలవారీగా జరుగుతున్న ప్రసవాల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందుల నిల్వలు, వాటి లభ్యతపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని ప్రస్తుత పరిస్థితులను గమనించిన కలెక్టర్.. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా బాధ్యతగా పనిచేయాలని వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీలో స్థానిక తహసిల్దార్ పి. జ్యోతి, ఎంపీడీవో బాలాజీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుమన్, మెడికల్ ఆఫీసర్ నిరోషా, ఆయుష్ డాక్టర్ వీణ, జూనియర్ అసిస్టెంట్ షకీల్, ల్యాబ్ టెక్నీషియన్ జనార్ధన్, సూపర్వైజర్ మరియు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మన తొలివెలుగు కథనంతో అప్రమత్తమైన విద్యుత్ శాఖ.. గంటన్నరలోనే సమస్యకు పూర్తి పరిష్కారం

**మీటర్ ఎత్తు పెంచి, 'ఫైబర్ ప్రొటెక్షన్ బాక్స్' ఏర్పాటు చేసిన సిబ్బంది**



**మన తొలివెలుగు, మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ :** మున్సిపల్ కేంద్రంలోని పోతాయిగడ్డ ప్రధాన రోడ్డు పక్కన ఉన్న బోరు బావి విద్యుత్ మీటర్, ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యపై 'మన తొలివెలుగు' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు అత్యంత వేగంగా, సానుకూలంగా స్పందించారు. నిత్యం ప్రజలు, చిన్నారులు నీళ్లు పట్టుకునే ఈ ప్రాంతంలో భద్రత లేని కరెంట్ మీటర్ వల్ల పొంచి ఉన్న ముప్పును పత్రికలో నిశితంగా ప్రచురించిన సంగతి తెలిసిందే.ఈ కథనంపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందిస్తూ, క్షేత్రస్థాయి సిబ్బందిని తక్షణమే అలర్ట్ చేశారు. వార్త వచ్చిన కేవలం గంటన్నర వ్యవధిలోనే మున్సిపల్ కేంద్రానికి చెందిన విద్యుత్ శాఖ అధికారులు, లైన్ స్టాఫ్ ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. నేలకు అత్యంత తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ మీటర్లను సురక్షితమైన ఎత్తులోకి మార్చారు. అంతేకాకుండా, వర్షపు నీరు పడకుండా మరియు ఎవరూ చేతులు పెట్టకుండా ఉండేందుకు ఆ మీటర్ చుట్టూ పటిష్టమైన ఒక ఫైబర్ ప్రొటెక్షన్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. కిందకు వేలాడుతున్న ప్రధాన కనెక్షన్ తీగలను సైతం పూర్తిగా పైకి సర్ది, సురక్షితంగా అమర్చారు. ఏదైనా ఘోర అనర్థం జరగకముందే ప్రజా సమస్యపై సానుకూలంగా స్పందించి, రికార్డు స్థాయిలో గంటన్నరలోనే సమస్యను పూర్తిగా పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి స్థానిక వ్యాపారులు, ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆహార భద్రత చట్ట సవరణను విరమించుకోవాలి

**మన తొలివెలుగు, మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ :** జాతీయ ఆహార భద్రత చట్టంలో చట్టసవరణ చేసి అంత్యోదయ, అన్నయోజన ద్వారా పేదలు వికలాంగులు పొందుతున్న 35 కేజీల బియ్యాన్ని తగ్గించాలనే ఆలోచనను, అంత్యోదయ రేషన్ కార్డులను రద్దు చెయ్యాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో సీపీఎం పార్టీ గ్రామ శాఖ సమావేశం వెండి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఆయన పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో ఇప్పటికి చాల మంది ప్రజలు ప్రజా పంపిణి వ్యవస్థకు దూరంగా ఉన్నారని, అర్హులను గుర్తించి సంఖ్యను పెంచాల్సిన కేంద్ర ప్రభుత్వం, దానిని తగ్గించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. జాతీయ సమగ్ర కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో పేదరికంలో పిల్లలు ఎదుగుదల లేక, తక్కువ బరువుతో, రక్తహీనతతో బాధపడుతున్నారని, ఇలాంటి పరిస్థితిలో ఆహార భద్రతను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం చట్టాన్ని బలహీన పర్చడం సరికాదని, ప్రస్తుతం అంత్యోదయ అన్నయోజన క్రింద నిరుపేదలకు వికలాంగుల కుటుంబాలకు ప్రతి నెల 35 కిలోల బియ్యం అందుతున్నాయని, దానిని మార్చి ప్రతి వ్యక్తికి 7 కిలోల చొప్పున ఇవ్వాలనే ప్రతిపాదన వల్ల పేదకుటుంబాలు వికలాంగుల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సంక్షేమానికి



కట్టుబడి ఉన్నామని గొప్పలు చెపుతున్న మోడీ ప్రభుత్వం, ఆహార భద్రత చట్టానికి ఎందుకు సవరణ చేస్తుందని ప్రశ్నించ్చారు. పేదలు వికలాంగులు పెరిగిన ధరలు, మందులు తదితర అవసరాల ఖర్చులు భరిస్తున్న నేపథ్యంలో అంత్యోదయ పథకం వారికీ ఎంతో ప్రయోజనకరంగా ఉందని, ఈ ప్రయోజనం తగ్గించడం ద్వారా పేదల కడుపు కొట్టడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, జాతీయ పోషకాహార భద్రత చట్టాన్ని బలోపేతం చేసి, వికలాంగులకు పేదకుటుంబాలకు 35కిలోల బియ్యాని కొనసాగిస్తూ, తీవ్రవైకల్యం ఉన్నవారికి ఇంటి వద్దనే రేషన్ పంపిణి చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, కొంపల్లి గంగయ్య, దడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మార్క్ 'ఎడ్యుకేషన్ జిహాద్'పై సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఫైర్.

**హైద్రాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందని, హైదరాబాద్ ఓల్డ్ సిటీ పరిధిలోని సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్‌లో జరిగిన ఘటన దీనికి ప్రత్యక్ష నిదర్శనమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థిని చేత కల్మా చదివించి, హోం వర్క్‌గా కల్మా మరియు 'సూరాఅల్-ఫాతిహా'లను నేర్చుకుని, పుస్తకాల్లో రాసుకుని ఇంటికి తీసుకువెళ్లాలని పాఠశాల యాజమాన్యం ఆదేశించడం అత్యంత ఆందోళనకరమని ఆయన ఖండించారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డియే పూర్తి బాధ్యత వహించాలని, "కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్" అంటూ ఆయన చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు.తన రెండవ తరగతి బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, ధైర్యంగా పాఠశాల యాజమాన్యాన్ని నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా



అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మరియు విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠినమైన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యత నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణని, హిందూ విద్యార్థులు మరియు వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవంపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్ళు మూసుకుని వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమని, కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలి తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదని, ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కును గౌరవించాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉందన్నారు. ఈ 'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరిపి, పాఠశాల యాజమాన్యంతో పాటు ఈ ఘటనకు కారకులైన ప్రతి ఒక్కరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

# సైబర్ నేరాలే అతిపెద్ద సవాలు

డీజీపీ సి.వి. ఆనంద్

సైబర్ నేరాలను నియంత్రించకపోతే తీవ్ర ఇబ్బందులు తప్పవు

సైబర్ మోసాలతో కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయి.. జీవితకాల సంపాదన కోల్పోతున్నారు

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై డీజీపీ సమగ్ర సమీక్ష

ఏఐ ఆధారిత కాల్ సెంటర్, సైబర్ ల్యాబ్‌లు, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్, డిజిటల్ ఫోరెన్సిక్ విభాగాలను పరిశీలించిన డీజీపీ-

సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించి దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలి

**హైదరాబాద్ :** తెలంగాణలో సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన సేవలు, సాంకేతిక సామర్థ్యాల పెంపు లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపడుతున్న కార్యక్రమాలపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్, సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలోని సైబర్ ల్యాబ్, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (ఏూఅ), సెంట్రల్ మానిటరింగ్ యూనిట్, సోషల్ మీడియా యూనిట్, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, డిజిటల్ ఫోరెన్సిక్ యూనిట్ తదితర విభాగాలను సందర్శించి వాటి పనితీరు, సాంకేతిక సామర్థ్యాలు, దర్యాప్తు విధానాలు, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని సమీక్షించారు.ఈ సందర్భంగా తెలంగాణ



సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శ్రీమతి శిఖా గోయల్, ఐపీఎస్ తో పాటు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాల తాజా ధోరణులు, దర్యాప్తు విధానాలు, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, బాధితులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై డీజీపీకి వివరించారు. సమీక్షలో భాగంగా డీజీపీ స్వయంగా ఏఐ ఆధారిత సైబర్ కాల్ సెంటర్ పనితీరును పరిశీలించారు.
"నేను సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయాను" అని బాధితురాలు చెప్పగానే ఏఐ వ్యవస్థ వెంటనే స్పందించి, ఆమెకు ధైర్యం చెబుతూ పేరు, ప్రాంతం, సమీప పోలీస్ స్టేషన్, సంఘటన వివరాలను సేకరించింది. అదే సమయంలో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆటోమేటిక్‌గా సమాచారం చేరే విధానాన్ని డీజీపీ పరిశీలించి అభినందించారు. ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు ఏఐ ఆధారిత సేవలను విస్తరించాలని అధికారులకు సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో ఫలితాలు సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం, 2025లో తెలంగాణలో సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల ఆర్థిక నష్టం నమోదైనప్పటికీ, 2024తో పోలిస్తే ఆర్థిక నష్టాల్లో 20 శాతం తగ్గుదల నమోదైంది. అదే విధంగా సైబర్ ఫిర్యాదులు 91,369కు పరిమితమవడంతో ఫిర్యాదుల్లో కూడా 3 శాతం తగ్గుదల నమోదైంది.నేరస్తుల ఖాతాల్లోని నిధులను నిలిపివేసే ఖూఊ మొత్తం రూ.255 కోట్ల నుంచి రూ.279 కోట్లకు పెరగగా, ఖూఊ శాతం 9 శాతం నుంచి 12 శాతానికి పెరగడం బాధితుల సొమ్ము రక్షణలో తెలంగాణ సాధించిన పురోగతికి నిదర్శనమని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్, ఐపీ ఎస్ తో పాటు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్, ఎస్పీలు హర్షవర్ధన్, సాయి శ్రీ, డీఎస్పీలు , సీఐలు , తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాసర సరస్వతి సన్నిధిలో అలరించిన అష్టావధానం



**బాసర :** బాసర సరస్వతి సన్నిధి లో అలరించిన అష్టావధానం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాలుశ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపంలో గల శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ ము కోటి పార్థివశివలింగ శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగమందిర మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దీపారాధన, కలశ స్థాపన ,విఘ్నేశ్వరశ్వర పూజ ,కోటి పార్థివ లింగ , శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకం పుష్పార్చన , బిల్వార్చన , గోపూజ ,గణపతి, నవగ్రహ, రుద్రహోమములు, భూదాన సంకల్ప పూజ, మహా అన్నదానము నిర్వహించారు. .కవితా విద్వన్మణి ,అవధాన విభూషణ విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి అష్టావధానం చేశారు . పద్యకోకిల ,అభినవ చ్రూళ్ళపిళ్ళ డా..ఓంప్రకాశ్ బోచ్కర్ సంచాలకులు గా,పృచ్ఛకులు గా ..ఆచార్య గొట్లూరి సురేశ్ బాబు(నిషిద్ధాక్షరి).,మైరోళ్ళ అశోక్ గౌడు (సమస్య) ,వల్లంభట్ల వనజ ( దత్తపది).,డా.భోగయ చంద్రశేఖర్ శర్మ (వర్ణన) ,గణపురం రాజేదర్ (ఆశువు )పేరంసంధ్యారాణి (న్యస్తాక్షరి)దుర్గి శ్రవణ్ కుమార్ శర్మ (ఛందోభాషణం) డాక్టర్ వెంకన్న జ్యోతి (అప్రస్తుత ప్రసంగం) పృ చ్ఛకులుగా పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

**రాజవొమ్మంగి :** ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేసి అర్హులైన ప్రతి రైతుకు అవసరమైన మొక్కల పంపిణీకి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీడబ్ల్యూఎంఏ) ప్రాజెక్టు డైరెక్టర్ అధికారులను ఆదేశించారు. రాజవొమ్మంగి మండలంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో గ్రామీణ ఉపాధి హామీ సిబ్బందితో ఆయన పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు.మండలంలో అర్హత కలిగిన రైతులకు అవసరమైన మొక్కల పంపిణీ కోసం లబ్ధిదారుల వివరాలు సిద్ధం చేసి, సంబంధిత ప్రతిపాదనలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.అనంతరం అప్పలరాజుపేట రిజర్వాయర్ వద్ద చేపడుతున్న పార్కు అభివృద్ధి పనులను ప్రాజెక్టు డైరెక్టర్ పరిశీలించారు. పనుల నాణ్యతను కాపాడుతూ మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## గోల్కొండ బోనాల్లో వైభవంగా ఉత్సవమూర్తుల శోభాయాత్ర..

### ప్రత్యేక ఆకర్షణగా బంగారు బోనం, కేరళ బ్యాండ్

**గోల్కొండ** బోనాల సందర్భంగా లంగర్‌హౌజ్ వద్ద రాష్ట్ర మంత్రులు అమ్మవారికి పట్టు చీరతో పాటు బంగారు బోనం సమర్పించిన అనంతరం సంప్రదాయబద్ధంగా ఉత్సవమూర్తుల శోభాయాత్రలు ప్రారంభమయ్యాయి.బడా బజార్ జగదాంబ దేవాలయ ప్రధాన అర్చకుడు దిగంబర్ చారి నివాసం నుంచి అమ్మవారి ఉత్సవమూర్తులను ఘనంగా ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అదే సమయంలో గోల్కొండ రిసాల బజార్‌లోని సాయిబాబా చారి నివాసం నుంచి శ్రీ మహంకాళి అమ్మవారి ఉత్సవమూర్తులు పోతురాజుల విన్యాసాలు, డప్పుల చప్పుళ్లు, ఆటపాటల మధ్య కోటవైపు బయలుదేరాయి.ఈ ఏడాది సాయిబాబా చారి కుటుంబం అమ్మవారికి బంగారు బోనంతో పాటు బంగారు కవచం, బంగారు చీర, నల్లపూసలను సమర్పించనుంది. శోభాయాత్రలో కేరళ బ్యాండ్‌తో పాటు వివిధ సంప్రదాయ బ్యాండ్ బృందాల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేలాది మంది భక్తులు "జై మహంకాళి" నినాదాల మధ్య ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొని గోల్కొండ బోనాలకు ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చారు.

## క్రెడిట్ ఔట్ రీచ్ కార్యక్రమ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

### కలెక్టరేట్ లో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ముఖ్య నేతలు

**నరసరావుపేట :** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని కోడెల శివప్రసాద్ స్టేడియంలో జరగనున్న క్రెడిట్ ఔట్రీచ్ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నరు. ప్రతిష్ఠాత్మక క్రెడిట్ ఔట్రీచ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా ముఖ్య నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ జానీ సైదా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. సభా వేదిక, లబ్ధిదారుల సౌకర్యాలు, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్, హెలిప్యాడ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు, లబ్ధిదారులు హాజరు కానున్నందున ప్రతి ఏర్పాటును పకడ్బందీగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అరవింద బాబు అధికారులను కోరారు. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## వ్యవసాయంపై మక్కువ.. పశుపోషణపై ప్రత్యేక దృష్టి.

### తన వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.

వనపర్తి శాసనసభ్యులు .



**వనపర్తి :** దొడగుంటపల్లి శివారులోని తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన కొబ్బరి, మామిడి, జామ తోటలను పరిశీలించి, మొక్కల పెరుగుదలను చూసుకున్నారు.అనంతరం పెంచుతున్న గోవులకు, స్వయంగా అరటిపండ్లు తినిపిస్తూ వాటి బాగోగుల గురించి ఆరా తీసారు.ప్రస్తుతం వనపర్తి ఎమ్మెల్యేగా ప్రజాసేవలో బిజీగా ఉన్నప్పటికీ, వృత్తిరీత్యా ప్రముఖ కాంట్రాక్టర్ అయినప్పటికీ,తూడి మేఘారెడ్డి కి వ్యవసాయంపై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదు.రైతు కుటుంబ విలువలను, వ్యవసాయం గొప్పతనాన్ని ఎప్పటికప్పుడు గుర్తుచేసుకుంటూ వ్యవసాయాన్ని తన జీవితంలో విడదీయరాని భాగంగా భావిస్తారు.పంటల సంరక్షణతో పాటు పశు సంపద అభివృద్ధిపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం ఆయన ప్రత్యేకత.ప్రజా సమస్యల పరిష్కారంలో నిత్యం నిమగ్నమై ఉండే ఎమ్మెల్యే మేఘారెడ్డి అవకాశం దొరికినప్పుడల్లా తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి పంటలు, తోటలు, పశువులను కోసం కొంత సమయాన్ని కేటాయిస్తుంటారు.రైతుల కష్టాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునే నాయకుడిగా, వ్యవసాయాభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమనే నమ్మకంతో ఆయన ఎల్లప్పుడూ రైతులకు అండగా నిలుస్తున్నారు.×బిప్రజాసేవను ఒక బాధ్యతగా, వ్యవసాయాన్ని ఒక జీవన విధానంగా భావించే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారు రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, పశుసంపద పరిరక్షణకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ ఆదర్శప్రాయమైన నాయకత్వాన్ని చాటుతున్నారు.

## బిజినెస్

## రూ.10 వేల కోట్ల కంపెనీకి బాస్.. హోమ్ లోన్ ఇవ్వని బ్యాంక్!




సొంతంగా ఒక కంపెనీని నిర్మించడం అనేది చాలా సాహసంతో కూడుకున్న పని, అది పెద్ద విజయం కూడా. అలాంటి వ్యక్తికి బ్యాంకు హోమ్ లోన్ ఇవ్వడం పెద్ద విషయం కాదని చాలామంది అనుకుంటారు. కానీ.. ఇక్కడ ఒక వ్యాపారవేత్తకు ఎదురైన సంఘటన మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఆ విషయాన్ని తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఫిన్‌టెక్ సంస్థ రైజ్ (ధన్ పేరెంట్ కంపెనీ) వ్యవస్థాపకుడు ప్రవీణ్ జాధవ్ ఇటీవల హోమ్ లోన్ కోసం ఓ బ్యాంకును ఆశ్రయించారు. అయితే ఆయన దరఖాస్తును బ్యాంకు తిరస్కరించింది. కారణం ఏమిటంటే.. ఆయనను 'హై రిస్క్ బారోవర్'గా పరిగణించడం. దాదాపు 1.2 బిలియన్ డాలర్ల (రూ.10 వేల కోట్ల కంటే ఎక్కువ) విలువైన కంపెనీని నడుపుతున్న వ్యక్తికి కూడా ఈ పరిస్థితి రావడం చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేసింది. తనకు ఎదురైనా అనుభవాన్ని ప్రవీణ్ జాధవ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన అతి తక్కువ సమయంలోనే తెగ వైరల్ అయింది. దీంతో పలువురు స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలు కూడా తమకు ఎదురైన ఇలాంటి అనుభవాలను గురించి వెల్లడించారు. నిజానికి బ్యాంకులు ఎవరి కంపెనీ విలువ ఎంత ఉందో అనే విషయాలను పరిగణలోకి తీసుకుని లోన్స్ అందించవు. లోన్ తీసుకున్న వ్యక్తి దాన్ని క్రమం తప్పకుండా తిరిగి చెల్లించగలడా.. లేదా?, అనే అంశాన్నే ప్రధానంగా పరిశీలిస్తాయి. అందుకే గతంలో తీసుకున్న లోన్స్ హిస్టరీ, ఆదాయపు పన్ను రిటర్నులు, స్థిరమైన ఆదాయం వంటి వివరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. ఉద్యోగుల విషయంలో ఇది చాలా సులభం. ఎందుకంటే ప్రతి నెలా ఒకే తేదీకి జీతం వస్తుంది. శాలరీ స్లిప్‌లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు చూసి వారి ఆదాయాన్ని సులభంగా అంచనా వేయవచ్చు. అందుకే వారికి హోమ్ లోన్ ప్రక్రియ కూడా చాలా వేగంగా లభిస్తుంది. కానీ వ్యాపారవేత్తల పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. వారి ఆదాయం ప్రతి నెల ఒకేలా ఉండదు. కంపెనీ లాభాలు, డివిడెండ్లు, షేర్ల విలువ ఆధారంగా ఆదాయం మారుతూ ఉంటుంది. చాలామంది స్టార్టప్ వ్యవస్థాపకులు కంపెనీ విలువ వేల కోట్ల రూపాయలు ఉన్నా, వ్యక్తిగతంగా తక్కువ జీతమే తీసుకుంటుంటారు. ఈ కారణంగా వారి ఆదాయాన్ని బ్యాంకులు స్థిరమైనదిగా పరిగణించకపోవచ్చు.

ఈ ఘటనపై స్పందించిన బ్యాంక్‌బజార్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ రతి శెట్టి కూడా ఇదే విషయాన్ని వివరించారు. బ్యాంకులు ఆదాయం ఎంత స్థిరంగా ఉందో, తిరిగి చెల్లించే సామర్థ్యం ఎంత ఉందో మాత్రమే పరిశీలిస్తాయని చెప్పారు. అయితే సరైన ఆర్థిక పత్రాలు, పన్ను వివరాలు, ఆదాయ రికార్డులు సమర్పిస్తే.. వ్యాపారవేత్తలు కూడా రుణాలు పొందే అవకాశాలు మెరుగుపడతాయని ఆమె అభిప్రాయపడ్డారు.

# విప్రో ఫలితాలు వీక్!

న్యూఢిల్లీ: దేశీ ఐటీ దిగ్గజం విప్రో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్ (2026--27, క్యూ1)లో కంపెనీ రూ.3,352 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే కాలంలో రూ.3,330 కోట్లతో పోలిస్తే లాభం దాదాపు ఫ్లాట్‌గా నమోదైంది. కాగా, మొత్తం ఆదాయం 10.6 శాతం జంప్ చేసి రూ.24,479 కోట్లకు చేరింది. గతేడాది క్యూ1లో ఆదాయం రూ.22,135 కోట్లుగా ఉంది.

**సీక్వెన్షియల్‌గా లాభం డౌన్...**

క్రితం ఏడాది చివరి క్వార్టర్ (2025--26, క్యూ4)లో నమోదైన రూ. 3,501 కోట్లతో పోలిస్తే సీక్వెన్షియల్‌గా క్యూ1 లాభం 4.2 శాతం దిగజారింది. అయితే, మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 1 శాతం పెరిగింది. గతేడాది క్యూ4లో ఆదాయం రూ. 24,236 కోట్లుగా నమోదైంది.

**గైడెన్స్.. ఫ్చ**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఐటీ సేవల వ్యాపార ఆదాయ వృద్ధి అంచనాలు (గైడెన్స్) కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆదాయం 2.57 బిలియన్ డాలర్ల నుంచి 2.63 బిలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చని కంపెనీ పేర్కొంది. దీని ప్రకారం సీక్వెన్షియల్‌గా ఆదాయ గైడెన్స్ మైనస్ 1.5 శాతం నుంచి ప్లస్ 0.5 శాతంగా లెక్కతేలుతుంది.

**ఇతర ముఖ్యాంశాలివీ...**

ఐటీ సేవలకు సంబంధించిన ఆదాయం క్యూ1లో 2.61 బిలియన్ డాలర్లుగా నమోదైంది. సీక్వెన్షియల్‌గా 1.4 శాతం తగ్గగా, వార్షికంగా 1 శాతం పెరిగింది.

ఐటీ సేవల నిర్వహణ మార్జిన్ 16 శాతంగా నమోదైంది.




సీక్వెన్షియల్‌గా 1.3 శాతం, వార్షికంగా 1.2 శాతం తగ్గింది.

కంపెనీ వాటాదారులకు రూ. 2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ. 2 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. దీనికి రికార్డు తేదీ ఈ నెల 27 కాగా, ఆగస్ట్ 14 లోపు చెల్లిస్తుంది.

ఈ ఏడాది జూన్ చివరి నాటికి కంపెనీ మొత్తం సిబ్బంది సంఖ్య 2,43,044కు చేరింది. మార్చి క్వార్టర్‌తో పోలిస్తే 888 మంది ఉద్యోగులు జతయ్యారు. ఉద్యోగుల వలసల రేటు (అట్రిషన్) 13.9 శాతంగా ఉంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు ధర గురువారం 1.83 శాతం లాభపడి రూ.178 వద్ద ముగిసింది.

క్లయింట్లు టెక్నాలజీ ఆధునీకరణ స్థాయి నుంచి ఏఐ--ఆధారిత ఆపరేటింగ్ మోడల్స్ వైపు మళ్లుతున్నారు. దీనివల్ల నాణ్యత, ఉత్పాదకత మెరుగుపడుతుంది. దీనికి అనుగుణంగా విప్రో అందిస్తున్న కన్సల్టింగ్ ఆధారిత, ఏఐతో కూడిన విధానం వల్ల క్లయింట్లు తమ కీలక వ్యాపారంలో ఏఐని అమలు చేసేందుకు వీలవుతోంది. క్లయింట్లు తమ ఏఐ మార్పుల కోసం మాపై ఉంచుతున్న నమ్మకానికి, మా విస్తృత సామర్థ్యాలకు ఇది నిదర్శనం.

# ఒకే ప్లాంట్.. 30 లక్షల వెహికల్స్!

దేశీయ వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తన చకన్ ప్లాంట్ నుంచి 30 లక్షల (3 మిలియన్) వాహనాన్ని విడుదల చేసింది. కంపెనీ ఈ మైలురాయి యూనిట్‌గా బీఈ 6 ఎలక్ట్రిక్ కారును విడుదల చేసింది. ప్రస్తుతం మహీంద్రా చకన్ ప్లాంట్‌లో తయారు చేస్తున్న మొత్తం 19 వాహనాల్లో బీఈ6 ఎలక్ట్రిక్ ఒకటి. ఇక్కడ ప్యాసింజర్ వాహనాలు మాత్రమే కాకుండా కమర్షియల్ వాహనాల ఉత్పత్తి కూడా జరుగుతోంది. చకన్ ప్లాంట్‌లో మహీంద్రా సంస్థ ప్రారంభ ఉత్పత్తి కొంత నెమ్మదిగా సాగినప్పటికీ.. ఆ తరువాత గణనీయంగా పెరిగిందని కంపెనీ బిజినెస్ ప్రెసిడెంట్, ఆర్. వేలుసామి పేర్కొన్నారు. ఇది వినియోగదారులలో పెరుగుతున్న నమ్మకాన్ని, మా సిబ్బంది, భాగస్వాములు, సరఫరాదారుల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. మహీంద్రా 2009 డిసెంబర్‌లో చకన్ ప్లాంట్‌లో ఉత్పత్తిని ప్రారంభించింది. 2018 సెప్టెంబర్‌లో 10 లక్షల యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని దాటింది. 20 లక్షల మైలురాయి 2024 మార్చిలో చేరుకోగా.. సుమారు 27 నెలల తర్వాత, 2026 జూలైలో మూడు మిలియన్ల యూనిట్ల మైలురాయిని చేరుకున్నట్లు ప్రకటించింది.

మహీంద్రా బీఈ6

ఇక బీఈ6 విషయానికి వస్తే.. ఇది ×చీ+ూా ఆర్కిటెక్చర్‌పై నిర్మించిన మహీంద్రా మొదటి రెండు 'బోర్న్ ఎలక్ట్రిక్' ాఖఎలలో ఒకటి. ఇది ఎక్స్ఈవీ 9ఈ కారుతో పాటు 2024 చివరలో భారతదేశంలో విడుదలైంది. దీని డెలివరీలు 2025లో ప్రారంభమయ్యాయి. దీజు 6 ఐదు ట్రిమ్ స్థాయిలలో, 59 నెవెష్ట్ర, 79 నెవెష్ట్ర బ్యాటరీ ఎంపికలతో లభిస్తుంది. ధరలు రూ. 18.90 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతాయి.



## టీమిండియాపై ఇంగ్లండ్ గ్రాండ్ విక్టరీ..

# రూట్ సెంచరీ మిస్

కార్డిఫ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలో 4 వికెట్ల తేడాతో భారత్ ఓటమి పాలైంది. టీమిండియా నిర్దేశించిన 254 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేధించింది. లక్ష్య ఛేధనలో ఇంగ్లండ్ ఆరంభంలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయినప్పటికీ, సీనియర్ బ్యాటర్ జోరూట్(133 బంతుల్లో 99 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయ తీరాలకు చేర్చాడు. రూట్ తన 21వ వన్డే సెంచరీకి ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయాడు. గస్ అట్కిన్సన్ ఫోర్ బాది మ్యాచ్‌ను ముగించడంతో రూట్‌కు సెంచరీ చేసే అవకాశం లభించలేదు. అతడితో పాటు విల్ జాక్స్ 30 పరుగులతో రాణించాడు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ రెండు, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, శివమ్ దూబే, అక్షర్ పటేల్ తలా వికెట్ సాధించారు.

**కుప్పకూలిన మిడిలార్డర్**

అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమిండియా 44 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌట్ అయింది. ఓ దశలో 300 పరుగులు చేసేలా కనిపించిన భారత్.. మిడిలార్డర్ విఫలం కావడంతో నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైంది. గిల్ సేన తన చివరి ఏడు వికెట్లను 55 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లి(65), శ్రేయస్ అయ్యర్(66) అర్ధ శతకాలతో రాణించగా.. ఆఖరిలో జస్ప్రీత్ బుమ్రా(20) కాస్త దూకుడుగా ఆడాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా అర్చర్ అట్కిన్సన్ తలా మూడు వికెట్లు పడగొట్టగా.. సాకిబ్ మహమూద్ 2, సామ్ కర్రన్, విల్ జాక్స్ ఒక్కో వికెట్ సాధించారు. ఈ విజయంతో ఇంగ్లీష్ జట్టు మూడు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఇరు జట్ల మధ్య సిరీస్ డిసైడర్ మూడో వన్డే ఆదివారం జరగనుంది.




## గుర్నూర్ బ్రార్‌పై క్రమశిక్షణ చర్యలు

ఇంగ్లండ్‌తో రెండో వన్డేకు ముందు భారత యువ ఫాస్ట్ బౌలర్ గర్నూర్ బ్రార్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (×జజ) క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. తొలి వన్డేలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు బ్రార్‌కు ఒక డీమెరిట్ పాయింట్ విధిస్తూ, అధికారికంగా హెచ్చరిక జారీ చేసింది.

ఏం జరిగిందంటే..?

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ గర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదాడు. ఆ మరుసటి బంతిని ఫాలోత్రూ సమయంలో అందుకున్న బ్రార్, ఆవేశంతో డకెట్ వైపు వేగంగా విసిరాడు. డకెట్ అప్రమత్తంగా తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనను పరిశీలించిన మ్యాచ్ రిఫరీ, బ్రార్ చర్యను ప్రమాదకరంగా పరిగణించి ఐసీసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నారు. బ్రార్ ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.9ను ఉల్లంఘించినట్లు తెలిపారు. ఈ నిబంధన ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌లో




ఆటగాడిపై లేదా అతడి సమీపంలో ప్రమాదకరంగా బంతిని విసరడం క్రమశిక్షణా ఉల్లంఘనగా పరిగణిస్తారు. బ్రార్ తన తప్పును అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకుండా కేసును ముగించారు. ఈ ఘటనకు సంబంధించి బ్రార్‌పై ఆర్థిక జరిమానా విధించలేదు. అయితే అతని ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ నమోదు చేయడంతో పాటు అధికారిక హెచ్చరిక జారీ చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో బ్రార్‌కు ఇదే తొలి క్రమశిక్షణా ఉల్లంఘనగా నమోదైంది. మ్యాచ్ విషయానికొస్తే.. ఇంగ్లండ్‌పై భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపోంది, 3 మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌట్ కాగా.. భారత్ 45.2 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బౌలింగ్‌లో అక్షర్ పటేల్ (4-62), బ్రార్ (2-61), ప్రసిద్ధ్ (2-50), బుమ్రా (1-31).. బ్యాటింగ్‌లో గిల్ (80), సుందర్ (52 నాటౌట్), అక్షర్ (57 నాటౌట్) సత్తా చాటి భారత్‌ను గెలిపించారు.

## స్పోర్ట్స్

## వివాదాస్పద బ్యానర్ ప్రదర్శించిన అర్జెంటీనా ప్లేయర్లు.. చర్యలు తీసుకోనున్న ఫిఫా




**అట్లాంటా:** ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు వివాదాస్ప రీతిలో బ్యానర్లు ప్రదర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన తర్వాత అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు జరుపుకున్నారు. అయితే మైదానంలోనే ఆ ప్లేయర్లు ఓ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఫాక్‌ల్యాండ్స్‌కు మద్దతు ఇచ్చే రీతిలో ఉన్న బ్యానర్‌ను ఆటగాళ్లు పట్టుకున్నారు. దీనిపై వివాదం చెలరేగింది. లాస్ మాల్వినాస్ సన్ అర్జెంటీనాస్ అని బ్యానర్‌లో రాసింది. అర్జెంటీనాకే ఫాక్‌ల్యాండ్స్ చెందుతాయన్న అర్థం వచ్చే రీతిలో బ్యానర్ ఉన్నది. అట్లాంటిక్ సముద్రంలో ఉన్న ఫాక్‌ల్యాండ్స్ దీవులు ఒకప్పుడు బ్రిటన్ ఆధీనంలో ఉన్నాయి. అయితే ఆ దీవులు తమకే చెందుతాయని అర్జెంటీనా పోరాడుతోంది. ఈ నేపథ్యంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్లేయర్లు .. బ్యానర్లు ప్రదర్శించడం వివాదానికి దారి తీసింది. ఫుట్‌బాల్ ప్లేయర్లు రాజకీయ సంకేతాలు ఇవ్వడం సరికాదు అని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. 1982లో ఈ రెండు దేశాల మధ్య ఆ దీవుల కోసం యుద్ధం కూడా జరిగింది. ఆ యుద్ధంలో వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 2014లో అర్జెంటీనా ప్లేయర్లు ఇలాగే ఓ వివాదాస్పద బ్యానర్‌ను ప్రదర్శించారు. అప్పుడు ఆ జట్టుకు 20 వేల పౌండ్లు జరిమానా వేశారు. అయితే తాజాగా జరిగిన ఘటన పట్ల దర్యాప్తు చేపట్టనున్నట్లు ఫిఫా అధికారులు చెబుతున్నారు. ఆటగాళ్లు నియమావళిని ఉల్లంఘించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.




## ప్రభాస్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్.. 'పౌజీ' రిలీజ్ డేట్ వచ్చేసింది

ప్రభాస్ ప్యాన్స్‌కి గుడ్ న్యూస్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పౌజీ' ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. డిసెంబర్ 3న ఈ మూవీ విడుదల కానుంది. ఈ మేరకు చిత్రబృందం రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేసింది. అందులో ప్రభాస్.. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్నాడు. మునుపెన్నడూ ఇలాంటి పాత్రలో ప్రభాస్‌ని చూడలేదు. ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్‌గా మారింది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈచిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటించగా.. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్ర బృందం త్వరలోనే షూటింగ్ ముగించుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీ కానుంది. ప్రచారంలో భాగంగా మరికొద్ది రోజుల్లో ఈ సినిమా నుంచి ఒక లిరికల్ సాంగ్‌ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

# అప్పులోళ్లు ఇంటిమీదకు వచ్చేవాళ్లు.. కూలీ పనికి వెళ్లా: విజయ్ సేతుపతి



సినిమా పరిశ్రమలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా స్వయంకృషితో ఎదిగిన నటుల్లో తమిళ 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి ఒకరు. కేవలం కోలీవుడ్‌లోనే కాకుండా టాలీవుడ్‌లోనూ తనదైన నటనతో విపరీతమైన అభిమానులను సంపాదించుకున్నారాయన. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో విజయ్ సేతుపతి తన బాల్యం, కుటుంబం ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందుల గురించి వివరించాడు.

**నాన్న పక్కనే కూర్చునేవాడిని**

చిన్నప్పుడు మేము చాలా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాం. మా నాన్న మా కోసం చాలా అప్పులు చేశాడు. అవి కట్టేందుకు చాలా ఇబ్బంది పడ్డాం. ఒక్కోసారి అప్పులు కట్టలేదని మా ఇంటిపైకి దాడికి వచ్చేవాళ్లు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని. మా నాన్నకు ఒక అలవాటు ఉండేది. ప్రతి రోజు రాత్రి 9.30 గంటలకు బుల్లెట్ బండిపై ఇంటికి వస్తూ.. ఫ్రైడ్ రైస్ తీసుకొచ్చేవాడు. మాతో షేర్ చేసుకొని తినేవాడు. అది నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకం.


**డబ్బుల కోసం సినిమాల్లోకి వచ్చా**

నటుడు అవ్వాలనేది నా లక్ష్యమే కాదు. కేవలం కుటుంబ బాధ్యతలు, ఆర్థిక అవసరాల కోసమే నేను సినిమాల్లోకి వచ్చా. మొదట్లో సినిమాల్లో నటించడం నచ్చేది కాదు. కష్టపడి పని చేయడం అంటే చాలా ఇష్టం. ఏ పని అయినా సరే గౌరవంగా చేయడం నా అలవాటు. సినిమాల్లోకి రాకముందు దుబాయ్‌లో అకౌంటెంట్‌గా పని చేశా. స్కూల్ ఏజ్‌లో కూలీ పనికి వెళ్లాను. రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్ ఫుడ్ జాయింట్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా ఇలా చాలా పనులు ఇష్టంలో చేశాను.

**అలా సినిమాల్లోకి..**

'దుబాయ్ నుంచి ఇండియా తిరిగి వచ్చాక నాటక రంగం వారితో పరిచయం ఏర్పడింది. ఆ అనుభవంతోనే సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ నటుడిగా మారాను'అని విజయ్ చెప్పుకొచ్చాడు. 'తెన్మేర్కు పరువకాట్రు' చిత్రంతో హీరోగా మారిన ఆయన.. ఆ తర్వాత 'సూదు కావ్వుమ్', 'విక్రమ్ వేద' 'మహారాజా' వంటి వైవిధ్యమైన చిత్రాలతో అగ్ర నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన హీరోగా నటించిన 'ట్రైన్', 'స్లమ్ డాగ్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

# నేను హీరో మెటిరియల్ కాదు.. ఆ సినిమా చేయను అని చెప్పా.. జగపతి బాబు..



తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న నటుడు జగపతిబాబు. ప్రస్తుతం సహాయ నటుడిగా రాణిస్తున్న ఆయన.. ఇప్పుడు ప్రధాన పాత్రలో నటించిన సినిమా వదలా. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను హీరో మెటీరియల్ కాదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హీరో అనే ట్యాగ్‌ను తాను నమ్మనని, సినిమా టైటిల్స్, హీరో ఇమేజ్ వంటి వాటి గురించి లెక్కలు వేసుకోనని ఆయన స్పష్టం చేశారు. "నేను ఎప్పుడూ పెద్ద హీరోని కాను. ఏదో ఇమేజ్ ఉంటుంది, కానీ నా ప్రకారం ఇమేజ్ అనేది ఏమీ కాదు. ఒకే ఇమేజ్‌తో ఎన్ని సినిమాలు చేస్తాం? ఎక్కడో ఆగిపోతాం. అసలు నేను హీరో కాన్సెప్ట్‌ను నమ్మను. హీరో అనేది కేవలం ఒక ట్యాగ్ మాత్రమే. జీవితంలో హీరోగా ఉండాలి కానీ, సినిమాల్లో కాదు" అని జగపతిబాబు అన్నారు. సినిమాల్లో హీరోగా వచ్చిపోయే పాత్రల మాదిరిగానే జీవితంలో సంతోషం, బాధ వంటివి కూడా తాత్కాలికమేనని, అవి వచ్చిపోతుంటాయని చెప్పుకొచ్చారు. తన చిన్నతనం నుంచే అన్నింటినీ వదిలేయడం, సరెండర్ అవ్వడం అలవాటు చేసుకున్నానని జగపతిబాబు పేర్కొన్నారు. "అన్నీ సరెండర్, సరెండర్, సరెండర్, సబ్మిషన్, వదిలేయడమే. ఎందుకంటే దట్ ఈజ్ ద వే లైఫ్ ఈజ్. ఇప్పుడు వదలాలి. ఇప్పుడు హ్యాపీనెస్, శాడ్ నెస్ అన్నీ కూడా టెంపరరీయే. వచ్చి పోయే. ఇవి కూడా అంతే" అని ఆయన తన తత్వాన్ని తెలియజేశారు. హీరోగా కెరీర్ ముగిసిన తర్వాత నెక్స్ట్ ఏమిటి అనే ప్రశ్న తనకు చాలా సింపుల్‌గా మారిందని, తాను పరిశ్రమలోకి రాకముందే ఆ హీరో ట్యాగ్‌ను డ్రాప్ చేశానని తెలిపారు. అయితే, నిర్మాతలు కోరడం వల్ల కొన్ని సినిమాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ప్రవరాఖ్యుడు సినిమా సమయంలో జరిగిన ఒక సంఘటనను ఆయన వివరించారు. అది 2009 నాటి విషయం అని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తాను రాజరవీంద్రకు చెప్పానని, "నా మీద తొమ్మిది కోట్లు పెట్టి సినిమా చేస్తే అది వర్కౌట్ కాదు. 100% డబ్బులు పోతాయి" అని స్పష్టంగా హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అప్పుడు రాజరవీంద్ర, "సార్, మీకు ఉన్న ఒక సినిమా అది. అది కూడా వదులుకుంటారా? డ్రాప్ చేస్తారా?" అని అడిగారని తెలిపారు. అందుకు తాను, "డబ్బులు కూడా పోతాయి కదా? వాట్ ఈజ్ ద పాయింట్? ఎవడో కొన్నప్పుడు ఆ సినిమా డబ్బులు తీసుకున్నప్పుడు అది ఫ్లాప్ కింద లెక్కే కదా?" అని సమాధానం ఇచ్చినట్లు చెప్పారు. అప్పటికే తాను హీరో మెటీరియల్ కానని, ఆ చాప్టర్ ముగిసిందని అంగీకరించానని జగపతిబాబు వెల్లడించారు. గతంలో గుమ్మడి గారు, కాంతారావు వంటి నటుల గురించి ప్రస్తావిస్తూ, ఒకే రకమైన పాత్రలు లేదా ఇమేజ్ వస్తే ఆ ముద్ర పడిపోతుందనే భయం తనలో లేదని జగపతిబాబు స్పష్టం చేశారు. అందుకే, క్యారెక్టర్ రోల్స్, మల్టీస్టారర్లలో నటించడానికి తనకు ఎటువంటి భయం లేదని, "మళ్లీ క్యారెక్టర్ ఇస్తారేమో, హీరో ఇవ్వరేమో" అనే ఆలోచన తనకు లేదని అన్నారు. జీవితం చాలా సింపుల్‌గా ఉంటుందని, దానిని అంతే సింపుల్‌గా చూడాలని అన్నారు.




## మహాప్రభు జగన్నాథ్ సినిమా రిలీజ్‌పై స్టే.. సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ

న్యూఢిల్లీ: ఎలీ యానిమేషన్స్ సంస్థ నిర్మించిన మహాప్రభు జగన్నాథ్ చిత్రాన్ని శుక్రవారం రిలీజ్ చేయాల్సి ఉన్నది. కానీ ఆ ఫిల్మ్ రిలీజ్‌పై ఒడిశా హైకోర్టు స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ఇవాళ వెల్లడించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనాతో కూడిన ధర్మాసనం ఈ కేసులో అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తక్షణమే ఈ పిటీషన్‌పై విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ కోరారు. యానిమేషన్ ఫిల్మ్‌లో జగన్నాథుడి పాత్రను చిత్రీకరించిన విధానంపై న్యాయ సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని ఒడిశా హైకోర్టు తన తీర్పులో చెప్పింది. మహేశ్ కుమార్ సాహూ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు ఇస్తూ సినిమా రిలీజ్‌పై స్టే విధించింది. పిల్ దాఖలు చేసిన వారిలో పూరి ఆచార్య డాక్టర్ ప్రమోద్ కుమార్, ఉమాశంకర్ ఆచార్య కూడా ఉన్నారు. ఒడిశాలో చిత్ర ప్రదర్శన ఆపేయాలని, ఆ సినిమాకు సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఒడిశా కోర్టులో పిటీషన్ వేశారు. చిత్రంలో జగన్నాథుడి బాల్యం, డైలాగ్‌లు, సాహసాలు, యుద్ధ సన్నివేశాలు చూపించిన తీరును తప్పుపట్టారు. ఆ సన్నివేశాలన్నీ స్కంద పురాణం, బ్రహ్మ పురాణం, సనాతన ఆలయ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు పిటీషన్‌లో అభ్యంతరాలు తెలిపారు.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PUBLICATIONS. AT M/S SMIL YS ONLINE H.NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500 O70 AND PUBLISHED AT VIPLAV MEDIA PUBLICATIONS. H.NO : 18-7-496 KANDIKAL GATE, UPPUGUDA, HYDERABAD, TELANGANA - 500 053. CEO & CHIEF EDITOR VANGA NAGARAJ REDDY (RAJU), EDITOR VANGA VIPLAV TEJA. PRGI : TGBIL/26/A2289. PHONE NO: +9184990 94183, +9193945 17067